# విశాల భారతి

తెలుగు దినపత్రిక

02-05-2026

www.vishalabharati.com
epaper.vishalabharati.com

శనివారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 120

## బలిపశువులుగా సెక్షన్ ఆఫీసర్లు

- పైస్థాయి జాప్యానికి కిందిస్థాయి అధికారులపై షోకాజ్ నోటీసులు
- బకాయిల చెల్లింపులో నిర్లక్ష్యంపై హైకోర్టు ధిక్కరణ చర్యలు
- వేల కోట్ల రిటైర్మెంట్ ప్రయోజనాలు, బిల్లులు నిలిపివేత
- అధికారులను బలిపశువులను చేస్తే మెరుపు సమ్మెకు హెచ్చరిక
- నిధుల విడుదల చేయకుండా సిబ్బందిని బాధ్యులను చేయడం
- బాధితులు రాకుండా కార్యాలయం వద్ద బ్యారికేడ్ల ఏర్పాటు

02



# కేసీఆర్ మెడకు టీఆర్ఎస్

## కారును పోలిన గుర్తుల వల్ల ఓట్ల నష్టం

టీఆర్ఎస్ నుండి బీఆర్ఎస్‌గా మారడం వికటించింది

- కవిత కొత్త పార్టీ పేరు కేసీఆర్‌కు సవాలు
- ఈవీఎంలో రెండు పేర్లుంటే ఓట్లు చీలే ప్రమాదం
- ప్రజల్లో ఇంకా టీఆర్ఎస్ పేరుకే ఆదరణ ఉండటం
- పేరుపై అభ్యంతరాలను ఈసీ తోసిపుచ్చడం




**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ రాజకీయ ముఖచిత్రంపై దశాబ్దాల పాటు ఏకఛత్రాధిపత్యం వహించిన కేసీఆర్, ఇప్పుడు తన రాజకీయ ప్రస్థానంలోనే అత్యంత సంక్లిష్టమైన గుర్తు, పేరు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. నిన్నటి వరకు కారును పోలిన గుర్తులపై కోర్టుల్లో, ఎన్నికల సంఘం వద్ద అలుపెరుగని పోరాటం చేసిన గులాబీ దళపతికి, ఇప్పుడు అంతకంటే పెద్ద సవాల్ ఎదురు కాబోతోంది. తాను కన్నబిడ్డలా పెంచి, అనంతరం జాతీయ రాజకీయ ఆకాంక్షల కోసం పక్కనపెట్టిన 'టీఆర్ఎస్' అనే అక్షరాలే ఇప్పుడు ఆయన రాజకీయ భవిష్యత్తుకు ప్రతిబంధకమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. అస్తిత్వ పోరాటం నుంచి ఆవిర్భవించిన పేరు, ఇప్పుడు అస్తిత్వానికే ముప్పుగా మారడం విశేషం. నిజానికి, ఎన్నికల క్షేత్రంలో అభ్యర్థుల గెలుపోటములను నిర్ణయించేది కేవలం సిద్ధాంతాలు మాత్రమే కాదు, ఓటరు నాడిని పట్టుకునే గుర్తులు కూడా. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి కారు గుర్తు ఉండగా, దానికి దగ్గరగా ఉండే రోలర్, బ్రెడ్ టోస్టర్ వంటి గుర్తులు స్వతంత్రులకు కేటాయించడం వల్ల పార్టీ భారీగా నష్టపోయింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో సుమారు 10 నుంచి 12 నియోజకవర్గాల్లో ఓటమికి ఈ గుర్తుల గందరగోళమే ప్రధాన కారణమని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బాహాటంగానే విమర్శించారు. గ్రామీణ ఓటర్లు కారు గుర్తు అని భావించి ఇతర గుర్తులకు ఓటు వేయడం వల్ల గెలుపు ముంగిట బోల్తా పడాల్సి వచ్చింది. గణాంకాలను పరిశీలిస్తే, నాగర్ కర్నూల్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి కేవలం 2,000 ఓట్ల స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యారు. కానీ, అక్కడ స్వతంత్ర మిగతా 3లో..



## క్రికెటర్ నుండి పోలీసు కెప్టెన్‌గా సీవీ ఆనంద్

- తెలంగాణ నూతన డీజీపీగా నియామకం
- అండర్-19 క్రికెట్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం
- హైదరాబాద్, సైబరాబాద్ కమిషనర్‌గా సేవలు
- నేర నియంత్రణలో సాంకేతికతకు పెద్దపీట
- భార్య లలిత ప్రొఫెసర్; కుమారుడు క్రికెటర్
- పోలీసు వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** యూపీఎస్సీ మలిపుటల్లో గెలిచి, ఖాకీ దుస్తులు ధరించిన ప్రతి ఐపీఎస్ అధికారి అంతిమ లక్ష్యం ఆ రాష్ట్ర పోలీస్ వ్యవస్థకు బాస్‌గా నిలవడమే. ఆ అరుదైన కలని, నిరంతర కృషిని నిజం చేసుకుంటూ 1991 బ్యాచ్‌కు చెందిన సీవీ ఆనంద్ తెలంగాణ రాష్ట్ర నూతన డీజీపీగా బాధ్యతలు చేపట్టారు. ఒక సామాన్యుడి నుంచి అసాధారణ పోలీస్ ఆఫీసర్‌గా ఎదిగిన ఆయన ప్రయాణం నేటి యువతకు మిగతా 2లో..

## ఆర్టీసీకి అండగా ఉండే బాధ్యత నాదే

### రూ.1,000 కోట్ల బకాయిల విడుదల

- శంషాబాద్, గాజులరామారంలో కొత్త టర్మినల్స్
- 1000 ఈవీ బస్సుల కొనుగోలు
- ఒక్క డ్రైవర్‌ను కూడా తొలగించబోమని హామీ
- సమ్మె కాలపు వేతనం చెల్లింపు, కేసుల ఎత్తివేత
- ఖర్చు తగ్గించి సంస్థను బలోపేతం చేయడం

04



## తెల్ల బంగారం సాగు దళారుల పాలు

- ఆర్గనైజర్ల కబంధహస్తాల్లో అన్నదాత
- పెట్టుబడి అప్పులపై భారీ వడ్డీల భారం
- మార్కెట్ కంటే తక్కువ ధరకే కొనుగోళ్లు
- జర్మినేషన్ పేరుతో కంపెనీల మోసం
- క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ లోపం
- పటిష్టమైన విత్తన చట్టం లేకపోవడం

03



## రేవంత్ రెడ్డి చేసేవన్నీ అప్పులే

- రోడ్ల కాంట్రాక్టుల్లో భారీ అవినీతి
- ధరలు పెంచి రూ.5 వేల కోట్ల నష్టం
- 5 ఏళ్ల వడ్డీ భారంతో ప్రజలపై అప్పులు
- రద్దు చేసిన అడ్వాన్సుల విధానం పునరుద్ధరణ
- ఒకే సంస్థకు 15 ప్రాజెక్టుల అప్పగింత
- టెండర్ల కోసమే రిటైర్డ్ ఇంజనీర్ల పొడిగింపు

03






## కార్మికులు సంక్షేమమే లక్ష్యం

- కార్మికుల హక్కుల రక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది
- 8 గంటల పనిదినం కోసం జరిగిన చికాగో పోరాటమే మే డే
- కార్మిక హక్కుల కోసం అంబేడ్కర్ చేసిన కృషి అనన్యం
- మహిళా కార్మికులకు ప్రసూతి సెలవుల హక్కు కల్పన
- వారసత్వ చట్టాల ద్వారా మహిళలకు ఆస్తి హక్కు లభించింది
- మిర్యాలగూడలో కార్మికులతో కలిసి భట్టి సహపంక్తి భోజనం

02



## బడా కాంట్రాక్టులన్నీ పొంగులేటికేనా?

- మంత్రి కంపెనీ కోసం ప్రాజెక్టు నిబంధనల మార్పు
- రాఘవ కన్‌స్ట్రక్షన్స్ వాటా 23శాతం నుండి 51శాతానికి పెంపు
- అర్హత గల సంస్థను కాదని మంత్రి కుమారుడికి ప్రాధాన్యం
- కీలక కాంట్రాక్టులన్నీ పొంగులేటి కుటుంబానికే దక్కడం
- పదవి అండతోనే దోపిడీ అని బీఆర్ఎస్, బీజేపీ విమర్శ
- ప్రభుత్వ పారదర్శకతను ప్రశ్నిస్తున్న తాజా నిర్ణయాలు

02

## సిలిండర్ ధరల పెంపు మే డే కానుకనా మోదీ?

- సిలిండర్ ధర ఒకేసారి రూ.1000 పెంచడం దారుణం
- పెరిగిన ధరలతో హోటల్ కార్మికుల ఉపాధికి ముప్పు
- గ్యాస్ ధర పెంపుతో సామాన్యుడు పకోడీ కూడా వేసుకోలేడు
- సెస్ పేరుతో పెట్రోల్, గ్యాస్ ధరలను పెంచి జేబులు కత్తరిస్తున్నారు
- చిన్న సిలిండర్ల ధరలు పెంచి బ్యాచిలర్లను వేధిస్తున్నారు
- పెంచిన ధరలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలి

03



# కార్మికులు సంక్షేమమే లక్ష్యం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ గడ్డపై శ్రమజీవుల స్వేదానికి విలువనిస్తూ, వారి హక్కుల రక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం వేళ మిర్యాలగూడలో జరిగిన వేడుకలు కేవలం ఉత్సవాలుగా కాకుండా, కార్మిక వర్గంతో ప్రభుత్వానికి ఉన్న పేగు బంధాన్ని చాటిచెప్పాయి. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్వయంగా కార్మికులతో కలిసి భోజనం చేయడం ద్వారా అధికార యంత్రాంగం సామాన్యుడికి ఎంత చేరువగా ఉందో నిరూపించారు. నల్లగొండ జిల్లా రాజకీయాల్లో ఈ మే డే వేడుకలు ఒక సరికొత్త అధ్యాయానికి వేదికగా నిలిచాయి. చికాగో వీధుల్లో 145 ఏళ్ల క్రితం రగిలిన విప్లవ జ్వాలలే నేటి ప్రపంచ కార్మిక హక్కులకు పునాదులని భట్టి విక్రమార్క గుర్తుచేశారు. నాడు కేవలం ఎనిమిది గంటల పని దినం కోసం జరిగిన పోరాటంలో చిందిన ప్రతి రక్తపు బొట్టు, నేడు ప్రపంచ వ్యాప్తంగా కోట్ల మంది కార్మికులకు రక్షణ కవచంగా మారింది. ఈ పోరాట స్ఫూర్తిని ప్రస్తుత తరానికి వివరించాల్సిన అవసరం ఉందని, చరిత్రను విస్మరిస్తే హక్కుల విలువ తెలియదని ఆయన స్పష్టం చేశారు. అణచివేతకు వ్యతిరేకంగా గళం ఎత్తిన ఆనాటి కార్మికుల త్యాగాలు మరువలేనివని కొనియాడారు. భారతదేశంలో కార్మిక చట్టాల రూపకల్పనలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పాత్రను డిప్యూటీ సీఎం ప్రత్యేకంగా ప్రస్తావించారు. కేవలం అణగారిన వర్గాల కోసమే కాకుండా, సమస్త కార్మిక లోకం కోసం బాబాసాహెబ్ చేసిన పోరాటం అనన్యసామాన్యం. బ్రిటిష్ కాలంలో వైస్రాయ్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిలర్‌గా ఉన్న సమయంలోనే ఆయన కార్మికుల పని వేళలపై గట్టిగా గళం వినిపించారు. 12 గంటల నుంచి 14 గంటల వరకు ఉన్న పని వేళలను ఎనిమిది గంటలకు కుదించాలని ఆయన చేసిన పోరాట ఫలితమే నేడు మనం అనుభ




విస్తున్న వెసులుబాటు. మహిళా కార్మికుల సంక్షేమం విషయంలో అంబేద్కర్ ముందుచూపు అద్భుతమని భట్టి వివరించారు. దేశంలో మొట్టమొదటిసారిగా ప్రసూతి సెలవుల ఆవశ్యకతను గుర్తించి, వాటిని చట్టబద్ధం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఇది కేవలం పరిశ్రమల్లో పనిచేసే వారికే కాకుండా, గృహ కార్మికులకు కూడా వర్తించేలా హక్కులు కల్పించబడ్డాయి. నేటి ఆధునిక యుగంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారంటే, ఆనాటి రాజ్యాంగ స్ఫూర్తితో కూడిన పునాదులే ప్రధాన కారణమని చెప్పవచ్చు. సామాజిక సమానత్వం కోసం హిందూ కోడ్ బిల్లు ప్రవేశపెట్టడం వెనుక ఉన్న సుదీర్ఘ పోరాటాన్ని కూడా ఈ సందర్భంగా గుర్తుచేశారు. 1955లో వచ్చిన హిందూ వివాహ చట్టం, 1956 నాటి హిందూ వారసత్వ చట్టం భారతీయ మహిళల జీవితాల్లో వెలుగులు నింపాయి. వివాహ హక్కులతో పాటు తండ్రి ఆస్తిలో సమాన వాటా పొందే హక్కు లభించడం వల్ల మహిళా సాధికారత సాధ్యమైందని భట్టి విక్రమార్క విశ్లేషించారు. చట్టాల ద్వారా సామాజిక మార్పును తీసుకురావచ్చని అంబేద్కర్ నిరూపించారని ఆయన కొనియాడారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ వేడుకల్లో స్థానిక నేతల భాగస్వామ్యం ఉత్సాహాన్ని నింపింది. ఎమ్మెల్సీ శంకర్ నాయక్, జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ వంటి ఉన్నతాధికారుల సమక్షంలో కార్మికుల సమస్యలపై చర్చ సాగింది. పాలన యంత్రాంగం అంతా ఒకే వేదికపైకి వచ్చి కార్మికులకు అండగా ఉంటామని ప్రకటించడం విశేషం. ఇది కేవలం ఒక రోజు కార్యక్రమం కాదని, నిరంతర సంక్షేమ ప్రక్రియకు ఇదొక సంకేతమని సభ అభిప్రాయపడింది. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల ద్వారా కార్మిక కుటుంబాలకు భరోసా లభిస్తోంది. ముఖ్యంగా అసంఘటిత రంగంలో ఉన్న వారిని గుర్తించి, వారికి బీమా సౌకర్యం కల్పించడంతో పాటు ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితే ప్రభుత్వం ఆదుకుంటుందనే ధీమాను భట్టి విక్రమార్క కల్పించారు. శ్రమ శక్తికి గౌరవం ఇవ్వడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, కార్మికులు తమ హక్కులను వినియోగించుకుంటూనే బాధ్యతగా పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు కార్మికులకు కొత్త ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నాయి. మిర్యాలగూడ వంటి ప్రాంతాల్లో వ్యవసాయాధారిత పరిశ్రమలు, రైస్ మిల్లర్ల వద్ద పనిచేసే వేలాది మంది కార్మికుల ప్రయోజనాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. కనీస వేతనాల అమలుతో పాటు పని ప్రదేశాల్లో భద్రతా ప్రమాణాలను పాటించేలా కఠిన చర్యలు తీసుకుంటామని ఉప ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. అధికారుల పర్యవేక్షణ నిరంతరం ఉంటుందని స్పష్టం చేశారు. కార్మికులతో కలిసి సహపంక్తి భోజనం చేయడం ద్వారా భట్టి విక్రమార్క ఒక బలమైన సామాజిక సందేశాన్ని ఇచ్చారు. హోదా పక్కన పెట్టి, చెమట చిందించే కార్మికుడి పక్కన కూర్చుని భోజనం చేయడం వల్ల వారిలో మనోధైర్యం పెరుగుతుంది. రాజకీయం అంటే కేవలం అధికార పీఠం కాదని, ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకోవడమేనని ఈ దృశ్యం నిరూపించింది. ఈ సందర్భంగా కార్మికులు తమ వ్యక్తిగత, సామాజిక సమస్యలను డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకువచ్చారు. విద్య, వైద్య రంగాల్లో కార్మిక బిడ్డలకు ప్రాధాన్యత ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కార్మికుల పిల్లలు ఉన్నత చదువులు చదివి ప్రయోజకులు కావాలనేదే అంబేద్కర్ ఆశయమని, దానికి అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం గురుకుల పాఠశాలలను బలోపేతం చేస్తోందని భట్టి గుర్తుచేశారు. ఆరోగ్య శ్రీ వంటి పథకాల ద్వారా కార్మిక కుటుంబాలకు కార్పొరేట్ వైద్యం అందుబాటులో ఉందని, ఏ ఒక్కరూ అనారోగ్యం కారణంగా ఆర్థికంగా కుంగిపోకూడదనేది ప్రభుత్వ సంకల్పమని ఆయన పేర్కొన్నారు. మొత్తానికి, మిర్యాలగూడలో జరిగిన ఈ మే డే వేడుకలు రాష్ట్ర అభివృద్ధిలో కార్మికుల పాత్రను మరోసారి గుర్తుచేశాయి. చారిత్రక అంశాలను ప్రస్తుత పరిస్థితులతో ముడిపెడుతూ భట్టి విక్రమార్క చేసిన ప్రసంగం ఆలోచనాత్మకంగా సాగింది. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి తెలంగాణను కార్మిక పక్షపాత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని సభ తీర్మానించింది. శ్రమకు గౌరవం కార్మికుడికి భరోసా అనే నినాదంతో ముందుకు సాగుతామని నాయకులు ప్రతిన పూనారు.

## దేశంలోనే మొట్టమొదటి.. పురాతన శాస్త్రాల ఆధారిత "దోష నివారణ" యాప్

- **5000 ఏళ్ల పురాతన బృహత్ పరాశర హోర శాస్త్రం ఆధారంగా**
- **"దోష నివారణ" యాప్ ను రూపొందించిన హైదరాబాద్‌కు చెందిన ఆజా ఆస్ట్రోటెక్ సంస్థ**




**హైదరాబాద్, విశాలభారతి:** AI యుగంలోనూ సమస్త మానవాళికి ఉపయోగపడేలా ఓ అద్భుతమైన యాప్ అందుబాటులోకి వచ్చింది. ఇప్పటిదాకా వచ్చిన అనేక అప్లికేషన్లు కేవలం టెక్నాలజీ మీద ఆధారపడగా.. తొలిసారిగా AI తో పాటు, పురాతన శాస్త్రాల ఆధారంగా పనిచేసే సరికొత్త యాప్ విడుదలైంది. దేశంలోనే మొట్టమొదటి సారిగా.. ఒక్క అప్లికేషన్ తో, మనిషిని వేధిస్తున్న అనేక అవరోధాలను గుర్తించడమే కాదు, తక్షణ పరిష్కారాలు అందించడం ఆ యాప్ ప్రత్యేకత. ఈ యాప్ ను రూపొందించింది ఎవరో కాదు.. మన హైదరాబాదీలే. హైదరాబాద్‌కు చెందిన ఆజా ఆస్ట్రోటెక్ కంపెనీ 5000 ఏళ్ల పురాతన బృహత్ పరాశర హోర శాస్త్రం ఆధారంగా "దోష నివారణ" యాప్‌ను ప్రారంభించింది. సమస్యలు మరియు దోషాలను గుర్తించి, బృహత్ పరాశర హోర శాస్త్రం సూత్రాల ప్రకారం సమర్థవంతమైన పరిష్కార మార్గాలను అందించే వేద ఆధారిత అప్లికేషన్ ఇది. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఫీనిక్స్ గ్రూప్ డైరెక్టర్ బడిగా శ్రీకాంత్, రిటైర్డ్ జిల్లా జడ్జి హేమంత్ కుమార్ దింత్యాల, అలాగే టీహబ్ మాజీ సీఈఓ శ్రీనివాస్ రావు మహంకాళి కలిసి ఈ యాప్‌ను ఆవిష్కరించారు. ఇది పూర్తిగా బృహత్ పరాశర హోర శాస్త్రం ప్రాథమిక సూత్రాలపై రూపొందించిన ప్రత్యేక డిజిటల్ ప్లాట్ ఫామ్ అని తెలిపారు కంపెనీ సీఈఓ ఫణిరాజ్ జలిగామా. "ప్రస్తుత అప్లికేషన్లు ఎక్కువగా AI పద్ధతుల ఆధారంగా రూపొందుతున్నాయి. కానీ మా సాఫ్ట్‌వేర్ వ్యవస్థ పూర్తిగా భిన్నంగా ఉంటుంది. కేవలం సాంకేతికతతో అంచనా వేసే AIకి బదులుగా, పరాశర మహర్షి రచించిన ప్రాచీన వేద జ్యోతిష్య సూత్రాలను విశ్లేషించి, వాటిని ఆధునిక సాఫ్ట్‌వేర్ ఇంజిన్‌గా రూపొందించాం" అని చెప్పారు. ఈ అప్లికేషన్ వినియోగదారుడి జనన సమయానికి సంబంధించిన గ్రహస్థితులను విశ్లేషించి "కాస్మిక్ బ్లూప్రింట్"ను రూపొందిస్తుంది. యోగాలు, దోషాలు, సరైన పరిహారాలు, వ్యక్తిగత రిపోర్టులు మరియు ముహూర్త సేవలను అందించడం దీని ప్రధాన లక్ష్యం. ఈ వ్యవస్థ వివాహాలు, గృహప్రవేశాలు, కొత్త ఉద్యోగంలో చేరడం వంటి ముఖ్య సందర్భాలతో పాటు సిసెక్షన్ ప్రసవాలు లేదా ప్రణాళికాబద్ధ శస్త్రచికిత్సల కోసం కూడా శుభ ముహూర్తాలను సూచించగలదు. భారతీయ ప్రవాసులకు సులభంగా అందుబాటులో ఉండేలా ఈ యాప్‌ను ప్రస్తుతం తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో ప్రారంభించినట్లు ఫణిరాజ్ తెలిపారు. జూన్ నెలలో మరో 11 భారతీయ భాషల్లో కూడా ఈ యాప్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. ఈ అప్లికేషన్ మీ స్మార్ట్ ఫోన్ లో ఉంటే, ప్రతి ఇంట్లో ఒక నిపుణుడైన జ్యోతిష్యుడు ఉన్నట్టే అని యాప్ రూపకర్తలు తెలిపారు.

# క్రికెటర్ నుండి పోలీసు కెప్టెన్‌గా సీవీ ఆనంద్

**మొదటిపేజీ తరువాయి**

ఒక గొప్ప పాఠం. శుక్రవారం ఆయన ఈ అత్యున్నత పదవిని చేపట్టిన వేళ, పోలీస్ శాఖలో సరికొత్త ఉత్సాహం ఉరకలేస్తోంది.

**క్రీడాకారుడి నుంచి సివిల్స్ విజేతగా**

సీవీ ఆనంద్ 1968, జూన్ 5న తెలంగాణలోని రంగారెడ్డి జిల్లాలో జన్మించారు. ఆయన విద్యాభ్యాసం అంతా హైదరాబాద్‌లోనే సాగింది. ప్రతిష్టాత్మక హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ప్రాథమిక విద్యను, ఉస్మానియా యూనివర్సిటీలో డిగ్రీ, పీజీ పూర్తి చేశారు. చదువులో ఎంతటి మేధావిగా ఉండేవారో, క్రీడా మైదానంలోనూ అంతటి చురుకుదనం ప్రదర్శించేవారు. ముఖ్యంగా క్రికెట్ అంటే ఆయనకు ప్రాణం. కాలేజీ రోజుల్లోనే అత్యుత్తమ క్రికెటర్‌గా పేరు తెచ్చుకున్న ఆయన, క్రీడల్లో రాణిస్తూనే ఐపీఎస్ అధికారి కావాలనే తన ఆశయాన్ని ఏనాడూ విస్మరించలేదు.



**ఇంగ్లాండ్ గడ్డపై భారత ప్రతిభ**

ఆనంద్ క్రీడా ప్రతిభ ఎంతటిదంటే.. 1986లో అండర్ 19 భారత క్రికెట్ జట్టుకు ఆయన ఎంపికయ్యారు. భారత్ తరపున ఇంగ్లాండ్‌కు వెళ్లి అక్కడ కీలక మ్యాచ్‌లు ఆడారు. అంతేకాకుండా ఆంధ్రా జట్టు తరపున కూడా అనేక మ్యాచ్‌ల్లో తన బ్యాటింగ్, ఫీల్డింగ్‌తో ఆకట్టుకున్నారు. ఆ సమయంలో ఆయన ముందు ఒక పెద్ద సందిగ్ధం నిలిచింది. అది వంద శాతం క్రీడలకే అంకితం కావాలా లేక సివిల్స్ వైపు అడుగులు వేయాలా అన్నది. ఎంతో ఇష్టమైన క్రికెట్‌ను పక్కన పెట్టి, సమాజ సేవకు మార్గమైన చదువుకే ఆయన పెద్దపీట వేశారు.

**మొదటి ప్రయత్నంలోనే ఐపీఎస్ సాధికారత**

పీజీ పూర్తయిన వెంటనే సీవీ ఆనంద్ యూపీఎస్సీ కోసం తీవ్రంగా శ్రమించారు. పట్టుదలే పెట్టుబడిగా సాగిన ఆయన ప్రిపరేషన్ ఫలితాన్ని ఇచ్చింది. జాతీయ స్థాయిలో 184వ ర్యాంకు సాధించి, మొదటి ప్రయత్నంలోనే ఐపీఎస్ సాధించి అందరినీ ఆశ్చర్యపరిచారు. 1991 బ్యాచ్ అధికారిగా ఆయన తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. ట్రైనింగ్ పూర్తయిన తర్వాత ఏఎస్పీగా, ఎస్పీగా వివిధ జిల్లాల్లో క్షేత్రస్థాయిలో పని చేస్తూ శాంతిభద్రతల పరిరక్షణలో తనదైన ముద్ర వేశారు.

**టెక్నాలజీతో నేరగాళ్ల గుండెల్లో నిద్ర**

సీవీ ఆనంద్ అంటే టెక్నాలజీ పోలీసింగ్‌కు మారుపేరు. నేరస్తులను పట్టుకోవడంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడటంలో ఆయన సిద్ధహస్తులు. హైదరాబాద్ ట్రాఫిక్ బాస్‌గా పని చేసిన సమయంలో ఆయన ప్రవేశపెట్టిన సంస్కరణలు నేటికీ ఆదర్శంగా ఉన్నాయి. ముఖ్యంగా మహిళల భద్రత కోసం 'షీ టీమ్స్' బలోపేతంలో ఆయన పాత్ర మరవలేనిది. డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చడానికి, సైబర్ నేరాలను అరికట్టడానికి ఆయన అనేక వినూత్న యాప్‌లను, వ్యవస్థలను అందుబాటులోకి తెచ్చారు.

**కమిషనరేట్ల బాధ్యతల్లో తిరుగులేని నేత**

హైదరాబాద్ కమిషనర్‌గా రెండు పర్యాయాలు పని చేయడం ఆయన సామర్థ్యానికి నిదర్శనం. గతంలో సైబరాబాద్ కమిషనర్‌గా, యాంటీ కరప్షన్ బ్యూరో డైరెక్టర్ జనరల్‌గా పనిచేసి అక్రమార్కుల భరతం పట్టారు. ఏ హోదాలో పని చేసినా బాధ్యతతో పాటు నిబద్ధతను జోడించడం ఆయన శైలి. పోలీస్ స్టేషన్లను ప్రజలకు చేరువ చేయడంలోనూ, ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను ప్రోత్సహించడంలోనూ ఆయన ఎప్పుడూ ముందుంటారు. క్లిష్టమైన కేసులను ఛేదించడంలో ఆయన చూపించే వేగం ఇతర అధికారులను సైతం ఆశ్చర్యపరుస్తుంది.

**తొలిచూపు ప్రేమ: లలితతో బంధం**

ఆనంద్ వ్యక్తిగత జీవితం కూడా ఒక అందమైన కావ్యమే. ఆయన అర్ధాంగి లలిత చెన్నై ఐఐటీలో విద్యాభ్యాసం చేశారు. కాలేజీ రోజుల్లో జరిగిన ఒక కార్యక్రమంలో లలితను చూసిన ఆనంద్ తొలిచూపులోనే ఆమెతో ప్రేమలో పడ్డారు. ఆ పరిచయం క్రమంగా బలపడి వివాహ బంధానికి దారితీసింది. వృత్తిరీత్యా ఆనంద్ బిజీగా ఉన్నా, కుటుంబాన్ని లలిత సమర్థవంతంగా నిర్వహించారు. పిల్లలు పెరిగి పెద్దయ్యాక ఆమె మళ్లీ తన కెరీర్‌పై దృష్టి సారించడం విశేషం.

**ప్రొఫెసర్‌గా లలితా ఆనంద్ ఎదుగుదల**

గృహిణిగా ఉంటూనే తన కలలను వదులుకోని లలిత, మళ్లీ చదువు మొదలుపెట్టి ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో రీసెర్చర్‌గా చేరారు. మ్యాథమెటిక్స్, స్టాటిస్టిక్స్ అంశాల్లో పట్టు సాధించి అక్కడే ప్రొఫెసర్ స్థాయికి ఎదిగారు. చదువుతో పాటు ఆమెకు కళలంటే మక్కువ. ముఖ్యంగా భరతనాట్యంలో ఆమెకు మంచి ప్రవేశముంది. దేశవ్యాప్తంగా ఎన్నో ప్రదర్శనలు ఇచ్చి కళాకారిణిగా గుర్తింపు పొందారు. గాత్రం, నాట్యం ఆమె జీవితంలో అంతర్భాగాలుగా మారాయి.

**వారసత్వంగా క్రికెట్ రక్తం**

తండ్రి సీవీ ఆనంద్ వదులుకున్న క్రికెట్ కలను వారి పెద్ద కుమారుడు చామ మిళింద్ నిజం చేస్తున్నారు. మిళింద్ ప్రస్తుతం హైదరాబాద్ తరపున రంజీలు ఆడుతూ, ఐపీఎల్‌లోనూ తన ప్రతిభను చాటుకుంటున్నారు. తండ్రి లాగే క్రమశిక్షణ, పట్టుదలతో క్రీడా రంగంలో దూసుకుపోతున్నారు. ఒకవైపు తండ్రి రాష్ట్ర పోలీస్ శాఖను నడిపిస్తుంటే, మరోవైపు కుమారుడు క్రీడా రంగంలో రాష్ట్ర పేరును నిలబెడుతున్నారు. నిజంగా ఈ కుటుంబం 'మేడ్ ఫర్ ఈచ్ అదర్' అనే పదానికి నిలువెత్తు సాక్ష్యం.

**హోంశాఖ నుంచి పోలీస్ బాస్‌గా.**

డీజీపీగా బాధ్యతలు చేపట్టే వరకు సీవీ ఆనంద్ హోంశాఖ కార్యదర్శిగా విధులు నిర్వహించారు. అక్కడ ప్రభుత్వ విధానాల రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన ఆయన, ఇప్పుడు నేరుగా ఫీల్డ్‌లోకి వచ్చి విభాగం మొత్తాన్ని నడిపించే బాధ్యతను భుజానికెత్తుకున్నారు. అడ్మినిస్ట్రేషన్ మరియు ఫీల్డ్ వర్క్.. రెండింటిలోనూ అపారమైన అనుభవం ఉండటం ఆయనకు పెద్ద ప్లస్ పాయింట్. నేటితరం పోలీసులకు ఆయన ఒక దిక్సూచిలా పనిచేయబోతున్నారు.

**నేర రహిత రాష్ట్రమే లక్ష్యంగా..**

తెలంగాణలో నేరాల నియంత్రణకు, ముఖ్యంగా సైబర్ మోసాలు, మాదకద్రవ్యాల నిర్మూలనకు డీజీపీగా సీవీ ఆనంద్ మరిన్ని విప్లవాత్మక మార్పులు తీసుకువస్తారని రాష్ట్ర ప్రజలు ఆశిస్తున్నారు. సాంకేతికతను సామాన్యుడి రక్షణ కోసం వాడటంలో ఆయన చూపించే చొరవ అభినందనీయం. కొత్త బాధ్యతల్లో ఆయన తన మార్క్ చూపిస్తూ, శాంతి భద్రతల పరిరక్షణలో రాష్ట్రాన్ని దేశంలోనే ప్రథమ స్థానంలో నిలుపుతారని ఆకాంక్షిద్దాం. నేటితరం యువతకు ఆనంద్ గారి సక్సెస్ స్టోరీ నిరంతరం ప్రేరణాత్మకంగా ఉంటుంది.

# బలిపశువులుగా సెక్షన్ ఆఫీసర్లు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్ర ఆర్థిక శాఖలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు 'తప్పు ఒకరిది.. దండన మరొకరిది' అన్నట్లుగా తయారయ్యాయి. గడచిన కొద్ది నెలలుగా ఈ శాఖలోని కిందిస్థాయి అధికారులు తీవ్ర మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు. ఒకవైపు పెండింగ్ బకాయిలు చెల్లించాలంటూ హైకోర్టు నుంచి వస్తున్న వరుస ఆదేశాలు, మరోవైపు ఆ ఆదేశాలను అమలు చేయడంలో వైఫల్యం చెందుతున్నామంటూ ఉన్నతాధికారులు జారీ చేస్తున్న షోకాజ్ నోటీసులు సచివాలయ వర్గాల్లో కలకలం రేపుతున్నాయి. వ్యవస్థలోని లోపాలను సరిదిద్దాల్సింది పోయి, బాధ్యతను కిందిస్థాయి సిబ్బందిపైకి నెట్టేయడంపై ఉద్యోగ వర్గాల్లో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ముఖ్యంగా పదవీ విరమణ చేసిన ఉద్యోగుల ప్రయోజనాలు, జీపీఎఫ్ బకాయిలు, మెడికల్ రియింబర్స్‌మెంట్ వంటి బిల్లుల చెల్లింపులో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోంది. ఈ జాప్యాన్ని సవాలు చేస్తూ బాధితులు న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తున్నారు. హైకోర్టు ఆదేశాలను సెక్షన్ అధికారులు ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నా, నిధుల విడుదలపై స్పష్టత లేకపోవడంతో ఫైళ్లు పెండింగ్‌లోనే ఉండిపోతున్నాయి. తీరా కోర్టు ధిక్కరణ నోటీసులు వచ్చేసరికి, ఉన్నతాధికారులు తమ బాధ్యతను కిందిస్థాయి సిబ్బందిపైకి నెట్టేయడం చర్చనీయాంశమైంది. బడ్జెట్ కేటాయింపులు ఉన్నా, నిధుల విడుదల జరగకపోవడమే అసలు సమస్యగా మారింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పగ్గాలు చేపట్టిన తర్వాత ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక ప్రయోజనాల విషయంలో స్పష్టమైన విధానం కరువైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పదవీ విరమణ పొందిన వేలమంది ఉద్యోగులు తమ జీవిత చరమాంకంలో సొంత డబ్బుల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి రావడం అత్యంత బాధాకరం. బకాయిల మొత్తం ఇప్పుడు ఏకంగా 20,000 కోట్ల రూపాయలకు చేరింది. ఆర్థిక క్రమశిక్షణ పాటించాల్సిన శాఖ, ఇప్పుడు కోర్టు నోటీసులతో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ప్రభుత్వం ప్రాధాన్యతలను మార్చుకోవాలని, సామాన్యుల అవసరాలకు పెద్దపీట వేయాలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. ప్రతిపక్షాలు, ఉద్యోగ సంఘాలు ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతున్నాయి. కేవలం కమీషన్లు వచ్చే కాంట్రాక్టర్లకు, బడా ప్రాజెక్టులకు మాత్రమే నిధులు ఠంచన్‌గా విడుదల చేస్తున్నారని, సామాన్య ఉద్యోగుల మెడికల్ బిల్లులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ మాత్రం ఎందుకు ఆపేస్తున్నారని వారు నిలదీస్తున్నారు. ఈ వివక్ష వల్లే వందలాది మంది బాధితులు విధిలేని పరిస్థితుల్లో న్యాయస్థానాల తలుపు తడుతున్నారు. గడిచిన ఏడాది కాలంలోనే సుమారు 1,000కి పైగా పిటిషన్లు దాఖలవ్వడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఒక్కో కేసులో కోర్టు విధిస్తున్న జరిమానాలు కూడా ప్రభుత్వ ఖజానాపై భారంగా మారుతున్నాయి. న్యాయస్థానం ఆదేశాలను అమలు చేయడంలో తాత్సారం జరుగుతుండటంతో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శికి వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు లభించడం లేదు. ఇటీవల కొన్ని కేసుల్లో కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో, ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరై సంజాయిషీ ఇచ్చుకోవాల్సి వచ్చింది. బకాయిల చెల్లింపునకు సంబంధించి ఒక కాలపరిమితిని కూడా కోర్టుకు సమర్పించారు. అయితే, ఆ గడువు ముగుస్తున్నా క్షేత్రస్థాయిలో ఎలాంటి కదలిక లేకపోవడంపై బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 90 రోజుల గడువు ముగిసినా బిల్లులు పాస్ కాకపోవడం అధికారుల అసమర్థతకు నిదర్శనమని న్యాయవాదులు వాదిస్తున్నారు. ఈ సంక్లిష్ట పరిస్థితుల్లో శాఖలోని ఉన్నతాధికారులు అనుసరిస్తున్న తీరు కిందిస్థాయి అధికారులను బలిపశువులను చేస్తోంది. ఇప్పటివరకు సుమారు 14 మంది అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయడం గమనార్హం. "బకాయిలు విడుదల చేసే అధికారం ఉన్నతాధికారులకే ఉంటుంది, నిధుల లభ్యత చూసి వారు సంతకం చేయాలి. కానీ ఫైలును పంపిన మాపై చర్యలు తీసుకోవడం ఏ రకమైన న్యాయం?" అని సెక్షన్ అధికారులు ప్రశ్నిస్తున్నారు. ఈ షోకాజ్ నోటీసుల పరంపర ఇలాగే కొనసాగితే మెరుపు సమ్మెకు దిగుతామని కొందరు హెచ్చరిస్తున్నారు. అధికారుల మధ్య నెలకొన్న ఈ సమన్వయ లోపం పాలనపై తీవ్ర ప్రభావం చూపుతోంది. సచివాలయంలోని రెండో అంతస్తులో ఉన్న ఆర్థిక శాఖ కార్యాలయం ఇప్పుడు ఒక కోటలా మారిపోయింది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఛాంబర్ వద్ద, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఛాంబర్ వద్ద ఏర్పాటు చేసిన బ్యారికేడ్లు దర్శనమిస్తున్నాయి. తమ గోడును చెప్పుకోవడానికి వచ్చే రిటైర్డ్ ఉద్యోగులను, ఉపాధ్యాయులను కనీసం లోపలికి రానివ్వకుండా అడ్డుకోవడానికి ఈ ఏర్పాటు చేశారనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రజాస్వామ్య పాలనలో ఇలాంటి నిరంకుశ పోకడలు గతంలో ఎన్నడూ చూడలేదని సీనియర్ ఉద్యోగులు వ్యాఖ్యానిస్తున్నారు. సచివాలయం ప్రజలకు అందుబాటులో ఉండాలి కానీ, ఇలా బ్యారికేడ్ల మధ్య బందీ కాకూడదని వారు కోరుతున్నారు. ఉమ్మడి రాష్ట్రం నుంచి నేటి వరకు సచివాలయంలో సందర్శకుల పట్ల ఇంత కఠినంగా వ్యవహరించిన దాఖలాలు లేవని ఉద్యోగ వర్గాలు పేర్కొంటున్నాయి. సందర్శకులను కలవడం ఇష్టం లేనప్పుడు లేదా నిధులు లేనప్పుడు ఆ విషయాన్ని అధికారికంగా ప్రకటించవచ్చు కదా అని వారు ప్రశ్నిస్తున్నారు. బ్యారికేడ్లు దాటి లోపలికి వెళ్లలేక, ఆర్థిక మంత్రిని కలవలేక వృద్ధాప్యంలో ఉన్న రిటైర్డ్ ఉద్యోగులు సెక్యూరిటీ సిబ్బందితో వాగ్వాదానికి దిగడం నిత్యకృత్యమైంది. దాదాపు 250 మందికి పైగా వృద్ధులు ప్రతిరోజూ ఆశగా వచ్చి నిరాశతో వెనుదిరుగుతున్నారు. ఇది ప్రభుత్వ మానవీయతను ప్రశ్నిస్తోంది. ఆర్థిక శాఖలోని 14 మంది అధికారులకు నోటీసులు ఇవ్వడం అనేది కేవలం శాఖాంతర వ్యవహారంగా మాత్రమే కాకుండా, ప్రభుత్వ వైఫల్యంగా కనిపిస్తోంది. కోర్టులో గడువు కోరడం, తీరా గడువు తీరిపోయాక సిబ్బందిపై చర్యలకు దిగడం ద్వారా అధికారులు తమను తాము రక్షించుకోవాలని చూస్తున్నారని అర్థమవుతోంది. ఉన్నతాధికారి సంతకం లేనిదే నయా పైసా విడుదల కాదని అందరికీ తెలిసిన సత్యం. అయినప్పటికీ, కిందిస్థాయి వారిని బాధ్యులుగా చూపడం వారి నైతిక స్థైర్యాన్ని దెబ్బతీస్తోంది. ఫలితంగా ఫైళ్ల కదలిక మరింత మందగించి, పెండింగ్ కేసుల సంఖ్య 15శాతం పెరిగింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తంగా ఉందనే వాదన ఒకవైపు వినిపిస్తుండగా, నిధుల మళ్లింపు జరుగుతోందని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఉద్యోగుల సంక్షేమం కంటే ఇతర ప్రాధాన్యతలకు ప్రభుత్వం మొగ్గు చూపుతోందని చెప్పడానికి పెండింగ్‌లో ఉన్న మెడికల్ రియింబర్స్‌మెంట్ బిల్లులే నిదర్శనం. అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రి ఖర్చుల కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఫైళ్లు కూడా నెలల తరబడి పెండింగ్‌లో ఉండటం దారుణం. 60 ఏళ్లు పైబడిన వారు తమ వైద్య ఖర్చుల కోసం ఇతరులపై ఆధారపడాల్సిన పరిస్థితి రావడం సామాజిక సంక్షేమానికే గొడ్డలిపెట్టు.





# బడా కాంట్రాక్టులన్నీ పొంగులేటికేనా?

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రాష్ట్రంలో ఇప్పుడు ఒకే ఒక్క పేరు మార్మోగుతోంది.. అదే పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. అధికార పీఠం దక్కిన వేళ, పారదర్శకతకు పట్టాభిషేకం చేస్తామని ప్రగల్బాలు పలికిన సర్కారు తీరు ఇప్పుడు విస్మయానికి గురిచేస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా, ఒక మంత్రి కుటుంబానికి చెందిన సంస్థలు వరుసపెట్టి భారీ ప్రాజెక్టులను కొల్లగొట్టడం రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. కేవలం కాంట్రాక్టులు దక్కించుకోవడమే కాకుండా, అధికార బలంతో టెండర్ నిబంధనలను సైతం తమకు అనుకూలంగా మార్చుకోవడం ప్రజాస్వామ్య వ్యవస్థలో సరికొత్త చర్చకు దారితీస్తోంది. హైదరాబాద్ నగర మకుటంలో మరో కీలకమైన మురుగునీటి శుద్ధి కేంద్రాల ప్రాజెక్టు ఇప్పుడు వివాదానికి కేంద్రబిందువైంది. దాదాపు రూ.1,906 కోట్ల భారీ వ్యయంతో చేపట్టే ఈ ప్రాజెక్టులో 'రాఘవ' మాయాజాలం స్పష్టంగా కనిపిస్తోంది. మొదట టెక్నికల్ అర్హతలు ఉన్న అనుభవజ్ఞ సంస్థలతో జతకట్టి, లోపలికి ప్రవేశించిన మంత్రి కుమారుడి కంపెనీ.. ఇప్పుడు ఏకంగా లీడ్ పార్ట్‌నర్‌గా అవతరించడం వెనుక భారీ వ్యూహమే దాగి ఉందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జారీ అయిన తాజా జీవో ప్రకారం, నిబంధనలను తుంగలో తొక్కి ఒక ప్రైవేట్ సంస్థ లాభమే పరమావధిగా ప్రభుత్వం వ్యవహరించినట్లు కనిపిస్తోంది. అసలు ఈ టెండర్ కథాకమీమాంశ ఏమిటంటే.. ప్రాజెక్టు దక్కించుకోవడానికి కావాల్సిన సాంకేతిక నైపుణ్యం, గత అనుభవం బీవీఎస్ఆర్ కంపెనీకి ఉన్నాయి. ఆ అనుభవాన్ని అడ్డం పెట్టుకుని రాఘవ కన్‌స్ట్రక్షన్స్ మైనర్ భాగస్వామిగా టెండర్ దాఖలు చేసింది. అయితే, ప్రాజెక్టు ఖరారైన తర్వాత కథ మొత్తం అడ్డం తిరిగింది. నిబంధనల ప్రకారం లీడ్ పార్ట్‌నర్ గా ఉండాల్సిన సంస్థను పక్కకు నెట్టి, కేవలం 23 శాతం వాటా ఉన్న రాఘవ సంస్థను 51 శాతానికి పెంచుతూ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అంటే, టెక్నికల్ క్రెడిబిలిటీ ఒకరిది.. అజమాయిషీ మాత్రం మంత్రి కుమారుడిది అన్నమాట! రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొలువుదీరినప్పటి నుండి 'రాఘవ' ప్రస్థానం అప్రతిహతంగా సాగుతోంది. గృహ నిర్మాణ రంగంలో వేల కోట్ల ప్రాజెక్టులు మొదలుకొని, సాగునీటి కాలువల నిర్వహణ వరకు అన్నిటా ఈ సంస్థదే పైచేయి అవుతోంది. ఉత్తర తెలంగాణలో అత్యంత కీలకంగా భావించే పలు కాలువ పనులు, వాటి ఆధునీకరణ కాంట్రాక్టులను దక్కించుకోవడంలో పొంగులేటి మార్క్ స్పష్టంగా కనిపిస్తోంది. విపక్షాలు ఎంతగా గగ్గోలు పెట్టినా, విచారణల పేరుతో అధికారులు ఎంత హడావుడి చేసినా.. అంతిమంగా కాంట్రాక్టులు మాత్రం మంత్రి ఇలాకాకే చేరుతుండటం గమనార్హం. సాధారణంగా ప్రభుత్వ టెండర్లలో 'టెక్నికల్ బిడ్' అనేది ప్రాజెక్టు భవితవ్యాన్ని నిర్ణయిస్తుంది. అనుభవం లేని సంస్థలకు పనులు ఇస్తే నాణ్యత దెబ్బతింటుందన్న భయంతో కఠిన నిబంధనలు విధిస్తారు. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ కి భారీ ప్రాజెక్టుల నిర్వహణలో తగినంత ట్రాక్ రికార్డు లేకపోయినా, జాయింట్ వెంచర్ల పేరుతో చక్రం తిప్పుతోంది. టెండర్ దక్కాక వాటాలను తారుమారు చేయడం అనేది అక్షరాలా నిబంధనల ఉల్లంఘనే అని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇది కేవలం వ్యాపార లావాదేవీ కాదు, ఒక రకమైన 'క్విడ్ ప్రో కో' అనే అనుమానాలు బలపడుతున్నాయి. ప్రభుత్వ నిర్ణయాల వెనుక ఉన్న అంతర్యమేమిటన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. ఏటా రూ.కోట్ల విలువైన పనులు ఒకే కుటుంబానికి చెందడం వల్ల పోటీతత్వం నశిస్తుందన్న ఆవేదన కాంట్రాక్టర్లలో వ్యక్తమవుతోంది. పైగా, నిర్ణయాధికారం అనుభవం లేని చేతుల్లోకి మారడం వల్ల రూ.1,906 కోట్ల ప్రజాధనం వృథా అయ్యే ప్రమాదం ఉందన్న విమర్శలు వస్తున్నాయి. కేవలం ఆర్థిక ప్రయోజనాల కోసమే టెండర్ షరతులను సవరించడం ప్రభుత్వ నైతికతను ప్రశ్నిస్తోంది. ముఖ్యమంత్రికి అత్యంత సన్నిహితుడు కావడమే పొంగులేటికి శ్రీరామరక్షగా మారిందన్న మాట గట్టిగా వినిపిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనుల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. చిన్న కాంట్రాక్టర్లను ఊడ్చిపారేస్తూ, పెద్ద చేపలైన మంత్రి అనుచర సంస్థలు ప్రాజెక్టులను మాయం చేస్తున్నాయి. ఒకవైపు నిరుద్యోగం, రైతుల సమస్యలపై గొంతు చించుకునే ప్రభుత్వం.. తమ సొంత మంత్రుల ఆర్థిక ఎదుగుదల కోసం ఎర్ర తివాచీ పరచడం విడ్డూరం. ఇదంతా చూస్తుంటే గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి ఉన్న తేడా ఏమిటన్న ప్రశ్న సామాన్య ప్రజానీకంలో తలెత్తుతోంది. మార్పు కోరి ఓటేసిన ప్రజలకు, ఈ కాంట్రాక్టుల క్రీడ కొత్త రకమైన విస్మయాన్ని కలిగిస్తోంది. విపక్ష నేతలు కేటీఆర్, కిషన్ రెడ్డిలు ఈ వ్యవహారంపై ఇప్పటికే కత్తులు నూరుతున్నారు. పారదర్శకత గురించి నీతులు చెప్పే కాంగ్రెస్ నాయకులు, ఈ అక్రమ కాంట్రాక్టులపై ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నిస్తున్నారు.

02.05.2026
శనివారం, హైదరాబాద్
/vishalabharati
GENERAL news
WWW.VISHALABHARATI.COM
విశాల భారతి

## కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం చేద్దాం

- పోరాటాలకు స్ఫూర్తి 'మేడే'
- కార్మిక రక్త కెరటం మన ఎర్ర జెండా
- నిరంకుశ కార్మిక కోడ్‌లపై రాజీలేని పోరు చేద్దాం
- కార్మికోద్యమాలకు పాలకులు తలవంచక తప్పదు
- మేడే పోరాట స్ఫూర్తితో కార్మిక చట్టాలను కాపాడుకుంటాం
- సీపీఐ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఘనంగా 141 వ మే డే వేడుకలు




**పాల్వంచ విశాలభారతి:** కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం చేద్దామని సీపీఐ పట్టణ మండల కార్యదర్శులు అడుసుమిల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచంద్రరావు జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబా వీసంశెట్టి పూర్ణచంద్రరావు పిలుపునిచ్చారు. 141వ మే డే సందర్భంగా పాల్వంచ పట్టణ, మండల పరిధిలోని 60 సెంటర్లలో, ఏఐటియుసి అనుబంధ ప్రజాసంఘాలు కార్యాలయాల, అడ్డాల వద్ద అరుణ పతాకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎనిమిది గంటల పని విధానం కోసం చికాగో నగరాన ఉవ్వెత్తున సాగైన పోరాటంలో ఎందరో కార్మికులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాటం చేసారని అన్నారు. ఆనాటి పోరాటమే ఎనిమిది గంటల పని విధానంని, కార్మిక చట్టాలని, చికాగో అమరుల స్ఫూర్తితో నేటి పాలకుల పై పోరాటాలకు కార్మికలోకం సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్మిక వర్గానికి అనేక హామీలు గుప్పించిన అధికారంలోకి వచ్చినా కేంద్రంలోని బిజెపి సర్కార్ అధికారం చేపట్టిన తరవాత అనేక పోరాటాలుతో సాధించిన కార్మిక చట్టాలను సవరించి యాజమాన్యాలకు, కార్పొరేట్ సంస్థలకు, పెట్టుబడిదారులకు అనుకూలంగా మార్చేందుకు కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఈ కుట్రలను కార్మిక వర్గం ఉద్యమాలతోనే తిప్పికొట్టి సంక్షేమ చట్టాలను పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కనీస వేతన చట్టం, పారిశ్రామిక చట్టాలను సవరణ చేయడంతోపాటు సంస్కరణలు పేరుతో ఉద్యోగులను, కార్మికులను తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారని, ప్రభుత్వాల దుశ్చర్యలను కార్మికువర్గ పోరాటంతో ఎదిరించి హక్కులను కాపాడుకోవాలని అన్నారు. చట్టసభల్లో ఉన్న మందబలంతో కార్మిక, ఉద్యోగ, ప్రజా, రైతు వ్యతిరేక చట్టాలను తీసుకువచ్చిందని, లాభాల్లో నడుస్తున్న సింగరేణి గనులు, రవాణా, టెలికాం, రైల్వే, బ్యాంకులు, ఎలసి, రక్షణ రంగం, ఇస్రో లాంటి తదితర ప్రభుత్వరంగ సంస్థలను కూడా ఆదాని, అంబానీ లాంటి పెట్టుబడిదారులకు అప్పణంగా కట్టబెట్టిందని విమర్శించారు. ప్రజల కోసం కాకుండా ఆర్థిక బకాసురులకు, ఆర్థిక నేరగాళ్ళగా మోడీ ప్రభుత్వం కొమ్ముకాస్తోందని ఆరోపించారు. కులాలు, మతాలు, ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతూ పబ్బంగడుకుంటుందేతప్ప దేశ ప్రజలకు మోడీ ప్రభుత్వం చేసింది శూన్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పుశెట్టి రాహుల్, కార్పొరేటర్లు వీసంశెట్టి విశ్వేశ్వరరావు, గుర్రం వెంకటేశ్వర్లు, నామ కీర్తి, నూనావత్ శ్యామల, గొర్లె అన్నపూర్ణ, జిల్లా సమితి సభ్యులు గుండాల నాగరాజు, డీ సుధాకర్, వీ పద్మజ, అన్నారపు వెంకటేశ్వర్లు, నిమ్మల రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

# సిలిండర్ ధరల పెంపు మే డే కానుకనా మోదీ?

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

హస్తిన వేదికగా కేంద్ర ప్రభుత్వం సామాన్యుడిపై మరోసారి ధరల అస్త్రాన్ని ప్రయోగించింది. కార్మికుల దినోత్సవం వేళ వారికి తీపి కబురు అందించాల్సింది పోయి, గ్యాస్ సిలిండర్ ధరలను అమాంతం పెంచి షాక్ ఇచ్చింది. ఈ నిర్ణయంపై భారత్ రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారకరామారావు నిప్పులు చెరిగారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఒకేసారి వెయ్యి రూపాయల మేర వాణిజ్య సిలిండర్ ధరను పెంచడం దారుణమని ధ్వజమెత్తారు. ప్రధాని మోదీ కార్మికులకు ఇచ్చిన మే డే కానుక ఇదేనా అంటూ ఆయన ఎద్దేవా చేశారు. ఎన్నికల పర్వం ముగియగానే సామాన్యుల నడ్డి విరచడం కేంద్రానికి అలవాటుగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెంచిన ధరల ప్రభావం స్వయం ఉపాధిపై ఆధారపడిన లక్షలాది మందిపై పడుతుందని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా హోటళ్లు, రెస్టారెంట్లు నిర్వహించే వారు ఈ భారంతో కుదేలయ్యే ప్రమాదం ఉంది. ఒక్క హైదరాబాద్ నగరంలోనే కమర్షియల్ సిలిండర్ ధర 3,315 రూపాయలకు చేరడం గమనార్హం. ఇంత భారీ స్థాయిలో ఖర్చులు పెరిగితే వ్యాపారాలు కొనసాగించడం అసాధ్యమని ఆయన పేర్కొన్నారు. హోటల్ రంగంపై ఆధారపడి జీవిస్తున్న కార్మికుల ఉపాధికి ఇది గొడ్డలిపెట్టుగా మారుతుందని హెచ్చరించారు. నిర్వహణ భారమైతే యాజమాన్యాలు సంస్థలను మూసివేసే దుస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకప్పుడు నిరుద్యోగులకు ఉపాధి కోసం పకోడీలు వేసుకోమని సలహా ఇచ్చిన ప్రధాని, ఇప్పుడు ఆ పకోడీలు కూడా వేసుకోలేని పరిస్థితిని సృష్టించారని కేటీఆర్ విమర్శించారు. గ్యాస్ ధరల పెంపుతో వంట గదిలో మంటలు పుడుతుంటే సామాన్యుడు బతికేదెలా అని ప్రశ్నించారు. చమురు కంపెనీల లాభాల కోసం ప్రజల జేబులకు చిల్లు పెట్టడం ఏమాత్రం సమంజసం కాదని స్పష్టం చేశారు. సెస్ రూపంలో కేంద్రం అదనపు భారాన్ని మోపుతూ ఇంధన ధరలను ఆకాశానికి చేర్చిందని మండిపడ్డారు.



రు. 65 రూపాయలుగా ఉండాల్సిన పెట్రోల్ ధరను రూ. 110120 వరకు పెంచిన ఘనత బీజేపీ ప్రభుత్వానికే దక్కుతుందని ఆరోపించారు. చివరికి చదువుకునే విద్యార్థులు, బ్యాచిలర్లు వాడే చిన్న గ్యాస్ సిలిండర్లను కూడా మోదీ ప్రభుత్వం వదిలిపెట్టలేదని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గది అద్దెలు, భోజన ఖర్చులు భరించలేక ఇబ్బంది పడుతున్న యువతపై ఈ పెంపు తీవ్ర ప్రభావం చూపుతుందని చెప్పారు. నిత్యావసర వస్తువుల ధరలు ఇప్పటికే పెరిగిపోగా, ఇప్పుడు గ్యాస్ భారం తోడవడంతో మధ్యతరగతి జీవి బతుకు చితికిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రోజూ టిఫిన్ సెంటర్లు, చిన్న హోటళ్లలో భోజనం చేసే సామాన్యులకు ఇకపై అదనపు భారం తప్పదు. ప్రజల కష్టాలను పట్టించుకోకుండా కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలే పరమావధిగా కేంద్రం సాగుతోందని ఆయన ఆరోపించారు. అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరల సాకుతో ఇక్కడ ధరలు పెంచడం ఎంతవరకు సమంజసమని కేటీఆర్ నిలదీశారు. ఇరాన్ అమెరికా ఉద్రిక్తతల పేరుతో స్థానికంగా గ్యాస్ ధరలను పెంచుతూ ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. ఒకవైపు రూపాయి విలువ అంతర్జాతీయ స్థాయిలో పాతాళానికి పడిపోతుంటే, మరోవైపు ఇంధన ధరలు ఆకాశాన్నంటుతున్నాయని విచారం వ్యక్తం చేశారు. ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టాల్సింది పోయి, కేవలం పన్నుల వసూళ్లపైనే కేంద్రం దృష్టి సారిస్తోందని మండిపడ్డారు. తక్షణం పెంచిన గ్యాస్, పెట్రోల్ ధరలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ అడ్డగోలు నిర్ణయాల వల్ల రవాణా రంగం కూడా సంక్షోభంలో కూరుకుపోతుందని కేటీఆర్ వివరించారు. డీజిల్ ధరల పెంపుతో రవాణా ఛార్జీలు పెరిగి, పరోక్షంగా కూరగాయల నుంచి పప్పు దినుసుల వరకు అన్నింటి ధరలూ పెరిగిపోయాయని గుర్తు చేశారు. దీనివల్ల సామాన్యుడి నెలవారీ బడ్జెట్ తలకిందులవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం అనుసరిస్తున్న ఇంధన విధానాలు కేవలం ధరల పెరుగుదలకు మాత్రమే దారితీస్తున్నాయని విశ్లేషించారు. పెంచిన ధరల విషయంలో పునరాలోచన చేయకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. హైదరాబాద్ వంటి మహానగరాల్లో కమర్షియల్ సిలిండర్ ధరలు మూడు వేల రూపాయల మార్కును దాటడం ఆ రంగంపై పెను ప్రభావాన్ని చూపుతుందని కేటీఆర్ విశ్లేషించారు. వేలాది మంది కార్మికులు పనిచేస్తున్న హోటల్ రంగం కుప్పకూలితే కొత్త నిరుద్యోగ సమస్య పుట్టుకొస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. స్వయం ఉపాధితో బతుకుతున్న చిన్న వ్యాపారులకు ఈ వెయ్యి రూపాయల పెంపు అనేది చావుదెబ్బ వంటిదని పేర్కొన్నారు. పన్నుల భారాన్ని తగ్గించి ప్రజలకు ఉపశమనం కలిగించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల దేశంలో ద్రవ్యోల్బణం పెరిగిపోతోందని కేటీఆర్ పేర్కొన్నారు. మధ్యతరగతి ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోవడంతో మార్కెట్లో నగదు చలామణిపై ప్రభావం పడుతోందని వివరించారు. ప్రభుత్వం సేకరిస్తున్న సెస్ నిధులు ఎటు వెళ్తున్నాయో ఎవరికీ తెలియడం లేదని ఆరోపించారు. రాష్ట్రాల వాటా ఇవ్వకుండా సెస్ పేరుతో కేంద్రమే నిధులను మళ్లించుకుంటోందని ధ్వజమెత్తారు. ప్రజల ప్రాథమిక అవసరాలైన వంట గ్యాస్, పెట్రోల్ మీద ఇంత దారుణంగా దోచుకోవడం సరికాదని హితవు పలికారు. గతంలో ఉన్న ధరలతో పోల్చితే ఇప్పుడు గ్యాస్ సిలిండర్ ధరలు రెట్టింపు అయ్యాయని కేటీఆర్ గణాంకాలను ఉటంకించారు. గ్యాస్ సబ్సిడీని క్రమంగా ఎత్తివేస్తూ సామాన్యుడికి దక్కాల్సిన వెసులుబాటును కేంద్రం హరించిందని విమర్శించారు. ఉజ్వల పథకం పేరుతో ఇచ్చిన కనెక్షన్లు ఇప్పుడు ఖాళీ సిలిండర్లతో మూలన పడి ఉన్నాయని గుర్తు చేశారు. ధరల పెరుగుదల వల్ల పేద ప్రజలు మళ్లీ పాత పద్ధతుల వైపు వెళ్లాల్సిన దుస్థితిని కేంద్రం కల్పిస్తోందని విచారం వ్యక్తం చేశారు. పెంచిన ప్రతి రూపాయి సామాన్యుడి కడుపు కొట్టడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై పెద్ద ఎత్తున పోరాటం చేయాల్సిన అవసరం ఉందని కేటీఆర్ పిలుపునిచ్చారు. ప్రజలను చైతన్యపరిచి కేంద్రం చేస్తున్న ధరల దందాను ఎండగడతామని చెప్పారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే యజమానులని, వారి ప్రయోజనాలను విస్మరించిన ఏ ప్రభుత్వం మనుగడ సాగించలేదని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రయోజనాలను సైతం తాకట్టు పెడుతూ కేంద్రం సాగిస్తున్న ఆర్థిక దోపిడీని అడ్డుకుంటామని స్పష్టం చేశారు. ధరల తగ్గింపు కోసం త్వరలోనే కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడించారు. కేంద్రం తన మొండి వైఖరిని వీడి వెంటనే ధరల తగ్గింపు ప్రకటన చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కార్మికుల దినోత్సవం రోజున వారికి భారం మోపడం అంటే వారి శ్రమను అవమానించడమేనని పేర్కొన్నారు. తక్షణమే గ్యాస్ సిలిండర్ మీద పెంచిన వెయ్యి రూపాయలను వెనక్కి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో సామాన్య ప్రజల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ప్రధాని మోదీ తన నిర్ణయాలను సమీక్షించుకుని సామాన్యులకు ఊరట కలిగించాలని ఆయన కోరారు.

# కేసీఆర్ మెడకు 'టీఆర్ఎస్'

**మొదటిపేజీ తరువాయి**

అభ్యర్థులకు వచ్చిన ఓట్లు అంతకంటే ఎక్కువగా ఉండటం గమనార్హం. నారాయణపేట్, డోర్నకల్, మెదక్, మహబూబాబాద్ వంటి స్థానాల్లో కూడా ఇదే పరిస్థితి పునరావృతమైంది. ఈ ఓట్ల చీలిక వల్ల కాంగ్రెస్ అభ్యర్థులు లబ్ధి పొందగా, బీఆర్ఎస్ అధికారాన్ని కోల్పోవాల్సి వచ్చింది. ఈ పరిణామాలపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినా, స్వతంత్ర అభ్యర్థులకు గుర్తుల కేటాయింపులో తమ నిబంధనలే అమలవుతాయని ఈసీ స్పష్టం చేయడంతో కేసీఆర్ నిస్సహాయ స్థితిలోకి వెళ్లారు. అయితే, అసలు సమస్య గుర్తుల దగ్గర ఆగడం లేదు. కేసీఆర్ భారత రాష్ట్ర సమితిగా పేరు మార్చిన తర్వాత, తెలంగాణ సెంటిమెంట్ పలచబడిందనే విమర్శలు వెల్లువెత్తాయి. గత పార్లమెంటు ఎన్నికల్లో 17 స్థానాలకు గాను ఒక్క సీటు కూడా గెలవకపోవడం పార్టీ శ్రేణులను కుంగదీసింది. టీఆర్ఎస్ అనే పేరులో ఉన్న 'తెలంగాణ' అనే పదం జనం గుండెల్లో బలంగా నాటుకుపోయింది. పేరు మార్పు వల్ల పార్టీ తన మూలాలను కోల్పోయిందన్న భావన ప్రజల్లోకి బలంగా వెళ్లిపోయింది. దీనిని సరిదిద్దుకోవాలని భావిస్తున్న తరుణంలోనే, తెలంగాణ రక్షణ సేన రూపంలో కొత్త తలనొప్పి మొదలైంది. కొత్తగా ఏర్పాటైన 'తెలంగాణ రక్షణ సేన' పార్టీని కూడా ప్రజలు సంక్షిప్తంగా టీఆర్ఎస్ అని పిలుస్తుండటం ఇప్పుడు బీఆర్ఎస్ నేతల్లో వణుకు పుట్టిస్తోంది. గ్రామాల్లో ఇప్పటికీ కారు గుర్తు టీఆర్ఎస్ అనే నినాదం బలంగా ఉంది. ఒకవేళ వచ్చే ఎన్నికల్లో ఈవీఎంలపై బీఆర్ఎస్ పక్కన ఈ కొత్త టీఆర్ఎస్ కనిపిస్తే, జనం సెంటిమెంట్‌తో అటువైపు మొగ్గు చూపే ప్రమాదం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. పాత పరిచయమున్న పేరు వైపు ఓటర్లు సహజంగానే ఆకర్షితులవుతారు, ఇది కేసీఆర్‌కు పెను ప్రమాదంగా పరిణమించనుంది. గతంలో తెలంగాణ రాష్ట్ర సమితిగా ఉన్నప్పుడు ప్రజలు పార్టీని తమ సొంత ఆస్తిగా భావించేవారు. కేసీఆర్ జాతీయ రాజకీయాల కోసం ఆ పేరును వదులుకోవడం చారిత్రక తప్పిదమని ఇప్పుడు పార్టీ నేతలే గుసగుసలాడుకుంటున్నారు. పేరు మార్చిన తర్వాత జరిగిన రెండు ప్రధాన ఎన్నికల్లోనూ పార్టీ గ్రాఫ్ పడిపోవడం ఈ వాదనకు బలాన్ని చేకూరుస్తోంది. ఇప్పుడు అదే పేరుతో మరో పార్టీ రంగంలోకి




రావడం, దానికి ఎన్నికల కమిషన్ ఆమోదం తెలపడం కేసీఆర్ వ్యూహాలకు గండి కొట్టే అంశం. దీనిపై ఈసీకి ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో గులాబీ శ్రేణులు ఆందోళనలో ఉన్నాయి. రాజకీయాల్లో సెంటిమెంట్ అనేది రెండంచుల ఖడ్గం లాంటిది. తెలంగాణ సాధనలో టీఆర్ఎస్ అక్షరాలు పోషించిన పాత్ర సామాన్యమైనది కాదు. ఇప్పుడు అదే అక్షరాలతో కూడిన వేరే పార్టీ బ్యాలెట్ పేపర్‌పై ఉంటే, ఓటరు అయోమయానికి గురవడం ఖాయం. ముఖ్యంగా నిరక్షరాస్యులు, వృద్ధులు కారు గుర్తు కంటే టీఆర్ఎస్ అనే పేరుకే ప్రాధాన్యత ఇచ్చే అవకాశం ఉంది. ఇది బీఆర్ఎస్ ఓట్ల శాతాన్ని గణనీయంగా తగ్గించడమే కాకుండా, ప్రత్యర్థులకు సునాయాసంగా గెలుపును కట్టబెట్టే అవకాశం ఉంది. ఈ పరిణామాలు చూస్తుంటే మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టు ఉంది కేసీఆర్ పరిస్థితి. ఒకవైపు పార్టీని కేడర్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత, మరోవైపు కారును పోలిన గుర్తుల బెడద, వీటన్నింటికీ తోడు ఇప్పుడు తన పాత పేరుతోనే యుద్ధం చేయాల్సి రావడం ఆయనకు పెద్ద పరీక్షే. రాజకీయ చాణక్యుడిగా పేరున్న కేసీఆర్, ఈ పేరు గుర్తుల చిక్కుముడిని ఎలా విప్పుతారన్నది ఆసక్తికరంగా మారింది. ఎన్నికల కమిషన్ తన నిర్ణయాన్ని మార్చుకోకపోతే, క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి వెళ్లి బీఆర్ఎస్ మాత్రమే అసలైనది అని ప్రచారం చేయడం అంత సులభం కాదు. 2024 ఎన్నికల ఫలితాలు బీఆర్ఎస్ వర్గాలకు కనువిప్పు కలిగించాయి. పేరు మార్పు అనేది కేవలం అక్షరాల మార్పు మాత్రమే కాదు, అది ప్రజల భావోద్వేగాలతో ముడిపడి ఉన్న అంశమని ఆలస్యంగా గుర్తించారు. అందుకే తిరిగి పార్టీ పేరును టీఆర్ఎస్ గా మార్చాలన్న ప్రతిపాదనను కేటీఆర్ తెరపైకి తెచ్చారు. కానీ అప్పటికే కాలం మించిపోయి, తెలంగాణ రక్షణ సేన రూపంలో మరో టీఆర్ఎస్ ప్రత్యక్షం కావడం కేసీఆర్ దురదృష్టమనే చెప్పాలి. ఇప్పుడు ఆ పేరును తిరిగి పొందడం లేదా కొత్త పేరుతో ప్రజలను మెప్పించడం సవాల్‌తో కూడుకున్న పని. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, ఇతర ఉప ఎన్నికల్లో ఈ పేరు ప్రభావం స్పష్టంగా కనిపించనుంది. ప్రతి ఓటు కీలకమైన ప్రస్తుత తరుణంలో, టీఆర్ఎస్ పేరుతో చీలిపోయే కొన్ని వందల ఓట్లు కూడా గెలుపోటములను తలకిందులు చేయగలవు. గతంలో కారును పోలిన గుర్తులపై చేసిన పోరాటం కంటే, ఇప్పుడు టీఆర్ఎస్ అనే పేరుపై చేయాల్సిన పోరాటం కఠినమైనది. ఎందుకంటే ఇది కేవలం గుర్తుకు సంబంధించింది కాదు, పదేళ్ల సెంటిమెంట్‌కు సంబంధించింది. తెలంగాణ రాజకీయాల్లో కేసీఆర్ ఎదుర్కొంటున్న ఈ విచిత్ర పరిస్థితి ఇతర రాజకీయ పార్టీలకు కూడా ఒక గుణపాఠం. ప్రాంతీయ సెంటిమెంట్‌తో ఎదిగిన పార్టీలు తమ మూలాలను, పేర్లను మార్చుకునేటప్పుడు ఎంతటి జాగ్రత్తలు తీసుకోవాలో ఇది నిరూపిస్తోంది. ఒకప్పుడు తన బలంగా ఉన్న పేరే ఇప్పుడు బలహీనతగా మారడం కేసీఆర్ రాజకీయ జీవితంలో ఒక పెద్ద మలుపు. మరి ఈ గండం నుండి గట్టెక్కి గులాబీ జెండాను మళ్ళీ రెపరెపలాడిస్తారా లేదా అనేది కాలమే నిర్ణయించాలి.

# రేవంత్ రెడ్డి చేసేవన్నీ అప్పులే

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రాష్ట్ర ప్రభుత్వ నిర్వహణలో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనుల్లో భారీ స్థాయిలో అవకతవకలు జరుగుతున్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు సంచలన ఆరోపణలు చేశారు. ప్రజాధనం దుర్వినియోగం అవుతోందని, పాలకుల స్వార్థ ప్రయోజనాల కోసం నిబంధనలను తుంగలో తొక్కుతున్నారని ఆయన ధ్వజమెత్తారు. అభివృద్ధి ముసుగులో జరుగుతున్న ఈ ప్రక్రియ వెనుక పెద్ద ఎత్తున అవినీతి దాగి ఉందని, ఇది రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై పెను భారంగా మారుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ పద్ధతిలో చేపడుతున్న రోడ్డు పనులే ప్రధానంగా లక్ష్యంగా హరీశ్ రావు తన విమర్శనాస్త్రాలను సంధించారు. అసెంబ్లీ వేదికగా తాము గతంలోనే హెచ్చరించినట్లుగా, టెండర్ల విలువను కృత్రిమంగా పెంచేశారని ఆయన గణాంకాలను బయటపెట్టారు. ముఖ్యంగా రహదారులు మరియు భవనాల శాఖలో తొలుత 11,000 కోట్ల రూపాయలుగా ఉన్న టెండర్ అంచనాలను, అనూహ్యంగా 25 శాతం మేర పెంచి 15,000 కోట్ల రూపాయలకు చేర్చారని ఆయన లెక్కలతో సహా వివరించారు. ఈ అదనపు పెంపు వెనుక ఆంతర్యం ఏమిటని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. కేవలం ఆర్అండ్‌బీ శాఖలోనే కాకుండా, పంచాయతీరాజ్ విభాగంలోనూ ఇదే తరహా ధోరణి కనిపిస్తోందని హరీశ్ రావు పేర్కొన్నారు. అక్కడ కూడా 6,000 కోట్ల రూపాయల అంచనా వ్యయాన్ని ఏకంగా 8,000 కోట్ల రూపాయలకు పెంచుకున్నారని విమర్శించారు. ఇలా రెండు ప్రధాన శాఖల్లో కలిపి సుమారు 5,000 కోట్ల రూపాయల అదనపు భారాన్ని ప్రభుత్వం కావాలనే ప్రజలపై మోపుతోందని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ ఖజానా ఖాళీగా ఉన్న తరుణంలో ఇలాంటి భారీ పెంపుదలలు ఎవరి జేబులు నింపడానికని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ రోడ్డు ప్రాజెక్టుల కోసం బ్యాంకుల నుంచి 60 శాతం మేర అప్పులు సేకరించి, వాటిని వచ్చే 15 ఏళ్ల పాటు వడ్డీతో సహా చెల్లించేలా ఒప్పందాలు చేసుకోవడం దారుణమని ఆయన అన్నారు. నేడు తీసుకునే నిర్ణయాలు రాబోయే తరాల మీద ఆర్థిక భారాన్ని మోపుతాయని హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం తాత్కాలిక ప్రయోజనాల కోసం రాష్ట్ర భవిష్యత్తును తాకట్టు పెడుతున్నారని, ఈ అప్పుల ఊబి నుంచి బయటపడటం అంత సులభం కాదని ఆయన హెచ్చరించారు. పాలనలో పారదర్శకత లోపించిందనడానికి ఈ టెండర్లే నిదర్శనమని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై హరీశ్ రావు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. గతంలో కాంగ్రెస్ హయాంలో మొబిలైజేషన్ అడ్వాన్సుల విధానాన్ని రేవంత్ రెడ్డి స్వయంగా వ్యతిరేకించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. నాడు జలయజ్ఞాన్ని 'ధనయజ్ఞం' అని విమర్శించిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు అదే విధానాన్ని అమలు చేయడం ఏ రకమైన నీతి అని ప్రశ్నించారు. టెండర్లలో 10 శాతం అడ్వాన్సులు ఇవ్వడం ద్వారా గుత్తేదారులకు మేలు చేయాలని చూస్తున్నారని, ఇది ముమ్మాటికీ ద్వంద్వ వైఖరి అని హరీశ్ రావు విమర్శించారు. 2014లో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే మొబిలైజేషన్ అడ్వాన్సుల విధానాన్ని పూర్తిగా రద్దు చేశామని హరీశ్ రావు స్పష్టం చేశారు. తాము అధికారంలో ఉన్నప్పుడు టెండర్ విలువ 5 శాతం కంటే ఎక్కువ ఉంటే వెంటనే వాటిని రద్దు చేసి, రీకాల్ చేసేవాళ్లమని ఆయన గుర్తు చేశారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం 25 శాతం అదనంగా ఉన్నా పట్టించుకోకుండా టెండర్లను ఆమోదించడం వెనుక చీకటి ఒప్పందాలు ఉన్నాయని ఆయన ఆరోపించారు. ఈ విధానం వల్ల కేవలం కొందరు వ్యక్తులకు మాత్రమే లాభం చేకూరుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వంలోని కొందరు ఉన్నతాధికారుల పాత్రపై కూడా హరీశ్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. పదవీ విరమణ పొందిన ఇంజనీర్లను మళ్లీ కీలక పోస్టుల్లో నియమించడం వెనుక టెండర్ల లొసుగులను కప్పిపుచ్చడమే ప్రధాన ఉద్దేశమని ఆయన ధ్వజమెత్తారు. ఆర్అండ్‌బీలో రిటైర్డ్ సీఈ వెంకటేశ్వరరావు, పంచాయతీరాజ్ విభాగంలో జోగారెడ్డి వంటి వారికి పదవీ కాలాన్ని పొడిగించడం ఈ కుట్రలో భాగమేనని ఆయన అన్నారు. అనుకూలమైన అధికారుల ద్వారా పనులు చక్కబెట్టుకోవాలని ప్రభుత్వం చూస్తోందని దుయ్యబట్టారు. నిబంధనలకు విరుద్ధంగా ఒకే కంపెనీకి దాదాపు 15 ప్రాజెక్టులు దక్కబోతున్నాయని హరీశ్ రావు ఆరోపించడం రాజకీయ వర్గాల్లో కలకలం రేపింది. ఈ వ్యవహారానికి సంబంధించిన పూర్తి ఆధారాలు తన వద్ద ఉన్నాయని, త్వరలోనే వాటిని బహిర్గతం చేస్తానని ఆయన సవాల్ విసిరారు. గుత్తేదారుల సిండికేట్‌ను ప్రోత్సహిస్తూ, అర్హత గల ఇతర సంస్థలను పక్కన పెట్టడం ప్రజాస్వామ్య విలువలకే విరుద్ధమని ఆయన అన్నారు. టెండర్ల ప్రక్రియలో జరుగుతున్న లోపాయికారి ఒప్పందాలను ప్రజల ముందు ఉంచుతామని స్పష్టం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అగమ్యగోచరంగా ఉన్న సమయంలో, ఇలాంటి భారీ వ్యయంతో కూడిన ప్రాజెక్టులు చేపట్టడం సమంజసం కాదని హరీశ్ రావు అభిప్రాయపడ్డారు. ఒకవైపు సంక్షేమ పథకాలకు నిధులు లేవంటూనే, మరోవైపు టెండర్ల పేరుతో వేల కోట్లు అదనంగా కేటాయించడం ప్రభుత్వ ప్రాధాన్యతలను ప్రశ్నార్థకం చేస్తోందని అన్నారు. ప్రజల సొమ్మును కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, కానీ ఇప్పుడున్న పరిస్థితుల్లో పాలకులే దోపిడీకి పాల్పడుతున్నారని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు.



# తెల్ల బంగారం సాగు దళారుల పాలు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ నేల తల్లీ.. కోట్లాది మందికి అన్నం పెట్టే ఆకలి తీర్చే అన్నదాతకు చిరునామా. కానీ, అదే నేల మీద చెమటను చిందించి, రక్తాన్ని ధారబోసి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతు గుండె చెరువవుతోంది. ప్రభుత్వాలు మారుతున్నాయి, పాలకులు మారుతున్నారు, అసలు రైతు బిడ్డలమేనని చెప్పుకుంటూ సింహాసనాన్ని అధిష్టించిన వారూ వస్తున్నారు. కానీ, మట్టి మనిషి స్థితిగతుల్లో మాత్రం మార్పు రావడం లేదు. విత్తనం వేసిన నాటి నుంచి విక్రయించే వరకు ప్రతి అడుగులోనూ మోసమే. ముఖ్యంగా 'తెల్ల బంగారం'గా పిలిచే పత్తి సాగులో అన్నదాత పడుతున్న అగచాట్లు వర్ణనాతీతం. వాణిజ్య పంటగా లాభాలు తెస్తుందని ఆశపడితే, అది కాస్తా అప్పుల ఊబిలోకి నెట్టేస్తోంది. జోగులాంబ గద్వాల జిల్లా.. తెలంగాణలో పత్తి విత్తన ఉత్పత్తికి పెట్టని కోట. సుమారు మూడున్నర దశాబ్దాలుగా ఇక్కడి రైతులు విత్తన పత్తిని పండిస్తూ దేశానికే దిక్సూచిగా నిలుస్తున్నారు. దాదాపు 50 వేల ఎకరాల్లో సాగవుతున్న ఈ పంట వెనుక వేలాది మంది కూలీల కష్టం, వందలాది కుటుంబాల జీవనోపాధి దాగి ఉంది. సుమారు 25కు



పైగా బడా విత్తన కంపెనీలు ఇక్కడ తమ సామ్రాజ్యాన్ని విస్తరించాయి. అయితే, ఈ కంపెనీలకు, రైతులకు మధ్య ఉండే అగాధమే ఇప్పుడు పెను శాపంగా మారింది. నేరుగా రైతుతో మాట్లాడి ఒప్పందాలు చేసుకోవాల్సిన కంపెనీలు, 'ఆర్గనైజర్లు' అనే మధ్యవర్తుల వ్యవస్థను ప్రోత్సహిస్తూ అన్నదాతను నిలువునా ముంచేస్తున్నాయి. గతంలో ఈ సీడ్ పత్తి సాగు చేసే రైతుకు ఎకరాకు లక్ష రూపాయల వరకు అడ్వాన్సుగా ఇచ్చేవారు. పెట్టుబడి భారంతో సతమతమయ్యే రైతుకు అది కొంత ఊరటనిచ్చేది. కానీ, కాలక్రమేణా ఆ మొత్తాన్ని సగానికి అంటే 50 వేల రూపాయలకే పరిమితం చేశారు. ఈ మార్పులను కంపెనీలు నేరుగా రైతుకు చెప్పవు; కేవలం ఆర్గనైజర్ల ద్వారానే సమాచారం పంపిస్తాయి. ఆర్గనైజర్ చెప్పిందే వేదం.. అతను గీసిన గీతే చట్టం అన్నట్లుగా సామాన్య రైతు పరిస్థితి తయారైంది. జూన్ మాసంలో ఫౌండేషన్ సీడ్ ఇచ్చే నాటి నుంచి, పంట చేతికొచ్చే డిసెంబర్ వరకు రైతుకు కావాల్సిన ఎరువులు, పురుగుల మందులు అన్నీ ఆర్గనైజర్లే అప్పుగా ఇస్తారు. అయితే, ఈ అప్పు ఉచితమేమీ కాదు. దీనికి భారీగా వడ్డీ (మిత్తి) వసూలు చేస్తారు. పంట చేతికొచ్చిన తర్వాత అసలుతో పాటు వడ్డీని కలుపుకుని రైతు చెల్లించాల్సి ఉంటుంది. అంటే, రైతు తన పొలంలో తనే కూలీగా మారి, ఆర్గనైజర్ల కబంధ హస్తాల్లో చిక్కుకుపోతున్నాడు. పత్తి పూత నుంచి కాయ వరకు కంటికి రెప్పలా కాపాడినా, ధర నిర్ణయించే అధికారం మాత్రం రైతుకు ఉండదు. మార్కెట్ ధరలతో సంబంధం లేకుండా, ముందే కుదుర్చుకున్న నామమాత్రపు ధరకే పంటను అప్పగించాల్సిన దౌర్భాగ్యం ఇక్కడ నెలకొంది.

అసలు మోసం అంతా గిట్టుబాటు ధర దగ్గరే మొదలవుతుంది. బహిరంగ మార్కెట్‌లో క్వింటాల్ పత్తి ధర 12 వేల రూపాయలు పలుకుతుంటే, ఈ సీడ్ రైతులు మాత్రం కేవలం 8 వేల రూపాయలకే ఆర్గనైజర్లకు విక్రయించాలి. ఎందుకు ఇంత తక్కువ అని అడిగే ధైర్యం రైతుకు లేదు; ఎందుకంటే అప్పటికే అతను అప్పుల్లో కూరుకుపోయి ఉంటాడు. పంటను జిన్నింగ్ మిల్లుకు తరలించి, పత్తిని, విత్తనాలను వేరు చేసిన తర్వాత అసలైన 'జర్మినేషన్' నాటకం మొదలవుతుంది. రైతు శ్రమను దోచుకోవడానికి కంపెనీలు వాడే అతి పెద్ద ఆయుధం ఇదే. మొక్క మొలకెత్తే సామర్థ్యాన్ని పరీక్షించే నెపంతో కంపెనీలు మూడు నెలల పాటు సమయాన్ని వృథా చేస్తాయి. ఈ ఫలితాలు కూడా నేరుగా రైతుకు అందవు. ఆర్గనైజర్ల ద్వారానే సమాచారం అందుతుంది. విత్తనాలకు డిమాండ్ ఎక్కువగా ఉంటే జర్మినేషన్ బాగుందని, డిమాండ్ తగ్గితే ఫలితాలు సరిగా రాలేదని సాకులు చెబుతూ తక్కువ ధర చెల్లిస్తారు. ఈ ప్రక్రియ మొత్తం ప్రైవేట్ ల్యాబ్‌లలోనే జరగడం వల్ల పారదర్శకత అనేది మచ్చుకైనా కనిపించదు. రైతు సంఘాలు ఎన్ని ఆందోళనలు చేసినా, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పరిస్థితి మొదటికే వస్తోంది. గద్వాల జిల్లాలో ఏడాదికి సుమారు రెండు వేల కోట్ల రూపాయల విత్తన వ్యాపారం జరుగుతుందంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇంత భారీ స్థాయిలో లావాదేవీలు జరుగుతున్నా, ప్రభుత్వం కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలమైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వ్యవసాయ శాఖ అధికారులు కేవలం గణాంకాలకే పరిమితమవుతున్నారు తప్ప, క్షేత్రస్థాయిలో రైతు పడుతున్న బాధలను పట్టించుకోవడం లేదని నడిగడ్డ హక్కుల పోరాట సమితి ఆవేదన వ్యక్తం చేస్తోంది. అధికారుల ఉదాసీనత వల్లే దళారులు రాజ్యమేలుతున్నారు. న్యాయం కోసం పోరాడే క్రమంలో హక్కుల సంఘాలు న్యాయస్థానాలను ఆశ్రయించడం కొంత ఉపశమనాన్ని ఇచ్చింది. ఇప్పటివరకు బడా విత్తన కంపెనీల నుంచి సుమారు 20 కోట్ల రూపాయల మేర నష్టపరిహారాన్ని రైతులకు ఇప్పించగలిగారు. అయితే ఇది సముద్రంలో కాకి రెట్ట లాంటిదే. ఎందుకంటే వేల కోట్ల వ్యాపారంలో రైతు నష్టపోతున్న మొత్తం అంతకంటే ఎన్నో రెట్లు ఎక్కువగా ఉంది. పటిష్టమైన చట్టాలు లేకపోవడమే ఈ దోపిడీకి ప్రధాన కారణమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం విత్తన చట్టాన్ని పటిష్టం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రాష్ట్రంలో 'సమగ్ర విత్తన చట్టం' లేకపోవడం వల్లనే దళారులు చట్టంలోని లొసుగులను వాడుకుంటూ రైతులను బలి పశువులను చేస్తున్నారు. విత్తన ఉత్పత్తిలో అగ్రగామిగా ఉన్న రాష్ట్రం, రైతు హక్కులను కాపాడటంలో మాత్రం వెనుకబడి ఉండటం శోచనీయం. కేవలం విత్తన కంపెనీల ప్రయోజనాలే పరమావధిగా కాకుండా, సాగు చేసే రైతుకు భద్రత కల్పించే దిశగా అడుగులు పడాలి. విత్తన ధరలను నిర్ణయించడం, జర్మినేషన్ పరీక్షలను ప్రభుత్వ ల్యాబ్‌ల ద్వారానే నిర్వహించడం, కంపెనీలు నేరుగా రైతులతోనే ఒప్పందాలు చేసుకునేలా నిబంధనలు తీసుకురావడం వంటి చర్యలు చేపడితేనే మార్పు సాధ్యమవుతుంది. లేదంటే, ఆర్గనైజర్లు కోటీశ్వరులవుతుంటారు, కంపెనీల టర్నోవర్లు పెరుగుతుంటాయి, కానీ రైతు మాత్రం చివరకు అప్పుల కుప్పపైనే మిగిలిపోతాడు. గద్వాల కోటలోని విత్తన రైతుల కన్నీళ్లు ఆగాలంటే పాలనలో చిత్తశుద్ధి, చట్టాల్లో కఠినత్వం అత్యవసరం.

# ఆర్టీసీకి అండగా ఉండే బాధ్యత నాదే

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రగతి చక్రం మరింత వేగంగా పరుగులు తీయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక అడుగులు వేశారు. శనివారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో 14 ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలతో సీఎం సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆర్టీసీకి అన్ని విధాలా అండగా ఉంటానని, సంస్థను బలోపేతం చేసే బాధ్యత తనదేనని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. ఉత్తమ పనితీరుతో సంస్థను లాభాల బాట పట్టించాలని కార్మికులకు సూచిస్తూనే, వారి చిరకాల వాంఛలైన సమ్మె కాలపు వేతనాలు, కేసుల ఎత్తివేతపై సానుకూల నిర్ణయం ప్రకటించి కార్మిక లోకంలో కొత్త ఉత్సాహాన్ని నింపారు. ఈ కీలక భేటీలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, ప్రభుత్వ ఉన్నతాధికారులు వికాస్ రాజ్, శ్రీనివాస రాజు, ఆర్టీసీ ఎండీ వై. నాగిరెడ్డితో పాటు పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఆర్టీసీని కేవలం ఒక రవాణా సంస్థగా కాకుండా, రాష్ట్ర ప్రజల జీవనరేఖగా అభివర్ణించిన సీఎం, సంస్థ ఆర్థిక స్థితిగతులు, భవిష్యత్ ప్రణాళికలపై దిశానిర్దేశం చేశారు. 'నేను వేరు, మీరు వేరు కాదు.. మనమంతా కలిస్తేనే ప్రభుత్వం' అంటూ కార్మికులతో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. దేశంలోనే ఆర్టీసీ అత్యంత గొప్ప సంస్థగా నిలవడానికి కార్మికుల నిరంతర శ్రమ, పట్టుదలే కారణమని ముఖ్యమంత్రి కొనియాడారు. గతంలో కార్మికులు చేసిన పోరాటాల్లో కాంగ్రెస్ పార్టీ భాగస్వామిగా ఉందని, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక వారి సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ఇప్పటికే ఆర్టీసీ కార్మికులకు చెల్లించాల్సిన రూ.1000 కోట్ల బకాయిలను విడుదల చేశామని, ఇది ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని వివరించారు. సంస్థపై ఉన్న అప్పుల భారాన్ని క్రమంగా తగ్గిస్తూ, ఆర్టీసీని ఒక స్వయం సమృద్ధి గల సంస్థగా మార్చడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.



అభివృద్ధి పనుల విషయంలో సీఎం రేవంత్ రెడ్డి సంచలన ప్రకటనలు చేశారు. నగర శివార్లలోని గాజులరామారంలో బస్ టర్మినల్ నిర్మాణం కోసం 100 ఎకరాల స్థలాన్ని కేటాయించగా, శంషాబాద్ విమానాశ్రయం సమీపంలో 150 ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయి బస్ పోర్టును నిర్మించబోతున్నట్లు ప్రకటించారు. ఆధునిక అవసరాలకు అనుగుణంగా 1000 కొత్త ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేసి, వాటిని మెట్రో రైలు సేవలతో అనుసంధానం చేయనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలను మెరుగుపరిచేందుకు భారీగా మినీ బస్సులను కూడా అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించారు. ఆదాయం పెంపు వ్యయం తగ్గింపు అనే సూత్రాన్ని సీఎం బలంగా వినిపించారు. ప్రస్తుతం ఆర్టీసీ కేవలం డీజిల్ కోసమే ఏడాదికి రూ.2000 కోట్లు ఖర్చు చేస్తోందని, ఈ భారాన్ని తగ్గించుకోవడానికి ఈవీ బస్సులు ఒక్కటే మార్గమని సూచించారు. ఖర్చు తగ్గితేనే సంస్థ మనుగడ సాధ్యమని, కార్మికులు కూడా పొదుపు చర్యల్లో భాగస్వాములు కావాలని కోరారు. గత ప్రభుత్వాల హయాంలో పేరుకుపోయిన బకాయిలను తామే బాధ్యతగా తీసుకుని పరిష్కరిస్తున్నామని, పీఆర్సీ విషయంలో ప్రభుత్వం త్వరలోనే సరైన నిర్ణయం తీసుకుంటుందని కార్మిక సంఘాలకు హామీ ఇచ్చారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆర్టీసీకి ప్రజల్లో ఆదరణ పెరిగిందని సీఎం గుర్తు చేశారు. ఈ పథకం అమలు కోసం ప్రభుత్వం ఇప్పటికే రూ. 8,000 కోట్లు నిధులను ఆర్టీసీకి మంజూరు చేసిందని లెక్కలతో వివరించారు. దీనివల్ల ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగిందని, ఇదే స్ఫూర్తితో ఆదాయ వనరులను మరిన్ని మార్గాల్లో అన్వేషించాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో డిపో మేనేజర్లు, కార్మికుల మధ్య ఎటువంటి సమన్వయ లోపం లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు. ఉద్యోగ భద్రత విషయంలో కార్మికుల్లో ఉన్న ఆందోళనలను సీఎం పటాపంచలు చేశారు. "ఆర్టీసీలో ఒక్క డ్రైవర్‌ను కూడా తొలగించే ప్రసక్తే లేదు" అని ఆయన కుండబద్ధలు కొట్టారు. సాంకేతిక మార్పులు వచ్చినప్పటికీ, మానవ వనరుల ప్రాధాన్యత తగ్గదని భరోసా ఇచ్చారు. అయితే, కార్మిక సంఘాలు రాజకీయ ప్రభావానికి లోనుకాకూడదని, సంస్థకు నష్టం కలిగించే పనులకు దూరంగా ఉండాలని హితవు పలికారు. సంస్థ మనుగడ సాగిస్తేనే అందరి భవిష్యత్తు బాగుంటుందని, యూనియన్లు మరియు విలీనం వంటి అంశాలపై సంఘాలే అంతర్గతంగా చర్చించుకుని ఏకాభిప్రాయానికి రావాలని సూచించారు. ముఖ్యమంత్రి తీసుకున్న మరో కీలక నిర్ణయం కార్మిక వర్గంలో హర్షాతిరేకాలను నింపింది. గతంలో కార్మికులు చేపట్టిన 3 రోజుల సమ్మె కాలానికి సంబంధించిన వేతనాలను వెంటనే విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే, వివిధ సందర్భాల్లో కార్మికులపై నమోదైన పోలీసు కేసులను పూర్తిగా ఎత్తివేయాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సూచించారు. ఈ నిర్ణయం వల్ల వేలాది మంది కార్మికులకు ఊరట లభించనుంది. చట్టపరమైన చిక్కుల నుంచి కార్మికులను విముక్తి చేయడం ద్వారా వారిలో నమ్మకాన్ని పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆర్టీసీకి చెందిన ఖరీదైన భూములను వాణిజ్యపరంగా వినియోగించుకుని ఆదాయాన్ని పెంచుకోవాలని సీఎం సూచించారు. కేవలం ప్రయాణికుల ఛార్జీల మీదనే ఆధారపడకుండా, లాజిస్టిక్స్ మరియు ఇతర సేవల ద్వారా సంస్థను లాభాల్లోకి తీసుకురావాలని చెప్పారు. ఆర్టీసీ సమస్యలపై శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అందుకోసం కార్మిక సంఘాలు నిర్దిష్టమైన ప్రతిపాదనలతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అధికారులు, కార్మికులు సమన్వయంతో పనిచేస్తే ఆర్టీసీని ప్రపంచ స్థాయి సంస్థగా తీర్చిదిద్దవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. సంస్థ బలోపేతానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరిస్తూనే, జవాబుదారీతనంపై సీఎం గట్టిగా మాట్లాడారు. డ్యూటీలో క్రమశిక్షణ, ప్రయాణికులతో మర్యాదపూర్వక ప్రవర్తన సంస్థ ప్రతిష్టను పెంచుతాయని అన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని కొత్త బస్సులను ప్రవేశపెట్టడం ద్వారా ప్రైవేట్ రవాణాకు దీటుగా ఆర్టీసీని నిలబెడతామని వాగ్దానం చేశారు. ఈ సమావేశం కేవలం చర్చలకే పరిమితం కాకుండా, తక్షణ కార్యాచరణకు నాంది పలికిందని కార్మిక సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేశారు. చివరగా, "ఆర్టీసీ ఆగిపోతే ఊపిరి ఆగిపోయినట్లే" అని భావోద్వేగంగా వ్యాఖ్యానించిన రేవంత్ రెడ్డి, ప్రభుత్వ అండదండలు ఎప్పుడూ ఉంటాయని హామీ ఇచ్చారు. రాష్ట్ర పునర్నిర్మాణంలో ఆర్టీసీ పాత్ర కీలకమని, ప్రతి పైసా సద్వినియోగం అయ్యేలా చూడాలని కోరారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు, భవిష్యత్ ప్రణాళికలు ఆర్టీసీలో కొత్త శకానికి పునాది వేస్తాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రభుత్వం చూపిస్తున్న ఈ సానుకూల ధోరణితో ఆర్టీసీ కష్టాల నుంచి గట్టెక్కి, బంగారు భవిష్యత్తు వైపు ప్రయాణిస్తుందని సామాన్య ప్రజలు సైతం ఆశిస్తున్నారు.

## ఘనంగా 140వ మే డే వేడుకలు



**కురవి, విశాలభారతి:** నల్లెల్ల గ్రామంలో సిపిఎం ఆధ్వర్యంలో 140 వ మే డే ను ఘనంగా నిర్వహించడం జరిగింది. సిపిఎం పార్టీ సీనియర్ మండల నాయకులు ఎస్టి కాజా పాల్గొని మాట్లాడుతూ కార్మికులు తమ హక్కుల కోసం అమరిక దేశంలోనే చికాగో నగరంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తుంటే అక్కడ ఉన్నటువంటి పాలకవర్గం పెట్టుబడుదారికి వర్గం కార్మికులపై పాశవీకంగా కాల్పులు జరిపింది. ఆ యొక్క రక్తమునుండే ఆవిర్భవించింది ఎర్రజెండా నేటికీ 140 సంవత్సరాలు కావస్తుంది. ఈనాడు కాంగ్రెస్ రకాలు ఉన్న టిఆర్ఎస్ ఎన్నికలున్నా బీజేపీ వెనకాల ఉన్న ఇతర బూర్జో పార్టీ వెనకాల ఎవరున్నా ఎనిమిది గంటలు పని చేస్తున్నారంటే శ్రమజీవులు హక్కుల కోసం ఎర్రజెండా రక్త తరపున కావించింది. ఇవాళ దేశంలోపు ఉన్నటువంటి అధికారంలో ఉన్న పాలకవర్గాలు కార్మికుల హక్కులను కాలరాస్తూ. బడా కార్పొరేట్ శక్తులకు ఊరిగం చేస్తూ కార్మికుల్లో శ్రమను కొల్లగొట్టడానికి ఎనిమిది గంటల నుండి 12 గంటల వరకు పని చేయించాలని లక్ష్యంతోటి ప్రభుత్వాలు పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తూ పోరాడి సాధించుకున్నటువంటి కార్మిక చట్టాలని తొలగించి ఇవాళ కేంద్రంలో ఉన్నటువంటి బిజెపి నాలుగు లేబర్ కోడ్ నీ తెచ్చింది దీని మూలంగా కార్మికులు హక్కులను కోల్పోతున్నారు కనుక మళ్ళీ తమ హక్కుల పరిరక్షణ కోసం కార్మికు లోకం ఉవ్వెత్తున ఉప్పెనల ప్రజా ఉద్యమాలు నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారన్నారు ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## దేవరుప్పుల మే డే వేడుకలు



**దేవరుప్పుల, విశాలభారతి:** మండలంలో సీపీఎం జనగామ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సింగారపు రమేష్ పాల్గొనగా రామరాజు పల్లి గ్రామంలో కళ్లెం బిక్షపతి,నీర్మాల గ్రామంలో పయ్యవుల బిక్షపతి,సింగరాజు పల్లి గ్రామంలో మండల సెక్రెటరీ ఇంటి వెంకట్ రెడ్డి,బంజర గ్రామంలో గడ్డం యాదగిరి, పెద్దమడూరు గ్రామంలో ఐలాపురం నరసమ్మ,చింత బావి తండాలో పురుషోత్తమలు, దేవరుప్పుల మండల కేంద్రంలో సిఐటియు మండల అధ్యక్షుడు సంగీ కరుణాకర్,దేవరుప్పుల గ్రామంలో నారాయణ, ధర్మాపురంలో జాటోత్ శీను నాయక్ లు జెండా ఆవిష్కరించి మే డే 140వ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు.ఆయా కార్యక్రమాలలో మండల, గ్రామాల నాయకులు వెంకన్న,దేవరుప్పుల కారోబార్ వెంకటరెడ్డి, ఉప్పలయ్య, కామారెడ్డి గూడెం కాసర్ల యాదిరెడ్డి, కొప్పుల ఉప్పలయ్య, దాసగారి సుమ,ఎండి హుస్సేన్,చొప్పరి యాదయ్య, రెండేళ్ల సత్తయ్య,ఎండి రంజాన్,గణేష్, అంగన్వాడి టీచర్లు,ఆశా వర్కర్లు, గ్రామపంచా వర్కర్లు పాల్గొన్నారు.

## కలెక్టరేట్లో ఘనంగా మేడే ఉత్సవాలు




**మహబూబాబాద్, విశాల భారతి:** జిల్లా కలెక్టరేట్లో ప్రధాన సమావేశ మందిరంలో అంతర్జాతీయ కార్మిక దినోత్సవం ఘనంగా జరిపారు. శుక్రవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన మే డే వేడుకలలో అదనపు కలెక్టర్ రెవిన్యూ కె. అనిల్ కుమార్ ముఖ్య అతిదిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా ఉద్యోగ కార్మికులందరికీ మేడే శుభాకాంక్షలు తెలిపారు. కార్మికుల కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని కార్మిక వర్గాన్ని కోరారు. ఉద్యోగ కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పని చేస్తున్నదని అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం కార్మికుల సంక్షేమంలో భాగంగా మే డేను ఘనంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని అసంఘటిత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 2వ తేదీ నుండి 10వ తేదీ వరకు మే డే వార్షికోత్సవంలో భాగంగా కార్మిక శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. బాల కార్మికులకు సంబంధించిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ బోధకుడు శ్రీకాంత్ (శిక్షణ శాఖ), ఉత్తమ కర్మాగారముగా ఎన్ కే ఆగ్రో Exports ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మరియు బాల కార్మికుడిగా ఉండి కాపాడబడి తిరిగి చదువు కొనసాగించిన ఒక బాలుడీకి ఉత్తమ పురస్కారాలను అందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్మిక కమిషనర్ ఓ. రమేష్, లేబర్ అధికారి క్రాంతి, జిల్లా ఉపాధి అధికారి టి రజిత , సి.డబ్ల్యు.సి చైర్మెన్ నాగావాణి, పంచాయతీ అధికారి హరిప్రసాద్, ఐటిఐ ప్రిన్సిపల్ బాబు, మరియు ఇతర శాఖలకు చెందిన అధికారులు, కళాకారులు, కార్మిక సోదర సోదరీమణులు మరియు కార్మిక సంఘ నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా మేడే వేడుకలు

**సిపిఐ,ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ**



**చౌటుప్పల్, విశాలభారతి:** మండల కేంద్రంలో సిపిఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ పార్టీ కార్యాలయం ముందు జెండాను సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లె శేఖర్ రెడ్డి ఎగురవేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1886 మే 1న అమెరికాలోని చికాగో నగరంలో కార్మికులు 8 గంటల పని దినం కోసం చేసిన పోరాటం చరిత్రాత్మకమని తెలిపారు. ఆ నిరసనల్లో జరిగిన కాల్పుల్లో మరణించిన కార్మికుల త్యాగాల ఫలితంగానే ఎర్రజెండా పుట్టిందని అన్నారు. మేడే స్ఫూర్తితో కార్మికుల పోరాటం మరింత బలపడిందని, 8 గంటల పని విధానాన్ని సాధించుకున్నారని అన్నారు.కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హమాలి, ఆటో, ట్రాన్స్‌పోర్ట్ కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టాలు తీసుకురావాలని, 4 లేబర్ కోడ్లను రద్దు చేసి పాత 44 కార్మిక చట్టాలను అమలు చేయాలని కోరారు. ఆటో డ్రైవర్లకు 60 ఏళ్లు దాటిన వారికి రూ.5,000 పెన్షన్ ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యుటీ, బోనస్, పెన్షన్ వంటి హక్కులను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.అనంతరం తంగేడుపల్లి రోడ్డులో సిపిఐ జెండాను పగిళ్ల మోహన్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ ముందు ఏఐటీయూసీ జెండాను సివిల్ సప్లై హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు పాపగల శంకరయ్య ఎగురవేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మున్సిపల్ సహాయ కార్యదర్శి ఉడుత రామలింగం, బద్దుల సుధాకర్, రొండి నరసింహ, దాసరి అంజయ్య, నీల బిక్షపతి, రోషణ అంజయ్య, ఎస్.ఏ. రహమాన్, దాసరి కృష్ణ, వంటల వెంకటేష్, దాసరి మనోహర్, గుండెబోయిన నరసింహ, ఉబ్బు దర్శన్, కే. సైదులు, ఇరిగి సంజీవ, బి. యాదయ్య, ఏ. బాబు, దాసరి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## హామీ కూలీలకు భోజనం ఏర్పాటు

**సుందర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఏల సుందర్**



**దేవరుప్పుల, విశాలభారతి:** అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మే డే సందర్భంగా దేవరుప్పుల మండలకేంద్రంలోని గుడి చెరువు ఆవరణలో ఉపాధి హామీ కూలీలకు శుభాకాంక్షలు తెలియజేసి రుచికరమైన మాంసాహార భోజనం ఏర్పాటు చేసి వారితో కలిసి భోజనం చేసిన సుందర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్,బిఆర్ఎస్ పార్టీ మండల నాయకుడు ఏల సుందర్. పదవి ఉన్న లేకున్న ప్రజలకు అందుబాటులో ఉంటూ కార్మికుల కష్ట సుఖాల్లో అండగా ఉండి గ్రామ అభివృద్ధి కి తోడ్పడతానని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు,వార్డు సభ్యులు,యువజన నాయకులు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## నోస్ ఫార్మాలో రియాక్టర్ పేలుడు

- **కంపెనీ సీజ్‌కు కలెక్టర్ ఆదేశం**
- **యాజమాన్యం నిర్లక్ష్యంపై ఎస్పీ ఆగ్రహం**
- **క్రిమినల్ కేసులు నమోదు**



**చిట్యాల విశాలభారతి:**

నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పిట్టంపల్లి గ్రామ పరిధిలో ఉన్న నోస్ ఫార్మాస్యూటికల్ కంపెనీలో జరిగిన రియాక్టర్ పేలుడు ఘటన జిల్లావ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ ఘటనలో ఆరుగురికి తీవ్ర గాయాలు కాగా ఒకరు చిన్న కాపర్తి కి బొడ్డు బాలకృష్ణ తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలుస్తుంది. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్ బడుగు చంద్రశేఖర్,ఎస్పీ శరత్ చంద్ర పవర్ యుద్ధప్రాతిపదికన స్పందించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్,ఎస్ పి భద్రతా ప్రమాణాల విషయంలో యాజమాన్యం అనుసరించిన వైఖరిపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.కంపెనీలో నిబంధనల ఉల్లంఘన స్పష్టంగా కనిపిస్తున్నందున, తక్షణమే పరిశ్రమను సీజ్ చేయాలని ఆదేశించారు.ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో పూర్తి స్థాయి నివేదిక కోరారు.గాయపడిన ఎనిమిది మంది కార్మికులకు హైదరాబాద్‌లోని డి ఆర్ డి ఓ అపోలో ఆసుపత్రిలో మెరుగైన చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు. కఠిన క్రిమినల్ చర్యలు కంపెనీ యాజమాన్యం ప్రాణాలతో చెలగాటం ఆడుతోందని ఎస్పీ శరత్ చంద్ర పవర్ మండిపడ్డారు.పునరావృతమైన ప్రమాదాలు: కేవలం 20 రోజుల వ్యవధిలో ఇది రెండో ప్రమాదం కావడం యాజమాన్యం యొక్క నేరపూరిత నిర్లక్ష్యాన్ని సూచిస్తోందని ఆయన అన్నారు.రక్షణ వ్యవస్థల లోపం: కంపెనీలో కనీస ఎమర్జెన్సీ సేఫ్టీ కిట్స్ లేవని ప్రాథమిక విచారణలో తేలిందని, బాధ్యులపై క్రిమినల్ కేసులు పెడతామని స్పష్టం చేశారు.ప్రస్తుత పరిస్థితి పేలుడు ధాటికి గాయపడిన వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.గతంలో జరిగిన ప్రమాదాలను కూడా పరిగణనలోకి తీసుకుని,ఈసారి కఠినమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.పోలీసులు అక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతను పర్యవేక్షిస్తున్నారు.

## విద్యార్థులకు పెన్నులను పంపిణీ చేసిన శివ గౌడ్



**రత్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో సన్మానం**

**చౌటుప్పల్, విశాలభారతి:** పట్టణ కేంద్రంలోని రత్నం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నటువంటి ఉచిత ఎంసెట్ కోచింగ్ శిక్షణ తరగతుల ఫేర్వెల్ పార్టీ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, డోనర్స్ విద్యార్థులు,పుర ప్రముఖులు పాల్గొన్నారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ ఉచిత శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసినటువంటి రత్నం ఫౌండేషన్ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. అదే విధంగా విద్యార్థులకు రానున్నటువంటి ఎగ్జామ్ కు ఆల్ ద బెస్ట్ చెప్పి ప్రముఖులకు సన్మాన కార్యక్రమం తో ఇట్టి కార్యక్రమం ముగిసింది.ఈ సందర్భంగా ఫౌండేషన్ నిర్వాహకులు ఊదరి మల్లేష్ మాట్లాడుతూ..మాకు సహకరించినటువంటి దాతలకు ధన్యవాదములు తెలిపారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ప్రముఖ న్యాయవాది నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చెరుకు శివకుమార్ గౌడ్,ఆర్టిఐ కార్యకర్త శేఖర్ ఉపాధ్యాయులు మల్లయ్య,సురేఖ,సిరి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మే డే



**డోర్నకల్, విశాలభారతి:** చిన్న గూడూరు మండల కేంద్రం రైస్ మిల్లు సెంటర్, కాలువ సెంటర్లో "మే దినోత్సవ" సందర్భంగా సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ,"భారత కార్మిక సంఘాల సమాఖ్య"(ఐఎఫ్టియు) సంయుక్త ఆధ్వర్యంలో అరుణ పతాకాలను ఎగురవేసి మే దినోత్సవం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ నాయకుడు బండపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశంలో కార్మిక వర్గం ఇతర పేద ప్రజల హక్కులను కాలరాస్తూ... గత 80 సంవత్సరాల నుండి సాధించుకున్న పబ్లిక్ సెక్టర్ను ప్రైవేటు బహుళ జాతి సంస్థలకు మోడీ ప్రభుత్వం కట్టబెట్టి కార్మిక వర్గానికి ఉద్యోగ భద్రత లేకుండా చేస్తుందన్నారు. చిన్న దేశమైన ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయిల్ దాడి జరిపి వేలాదిమంది ప్రజలు, ముఖ్యంగా పసిపిల్లల ప్రాణాలను తీసి రక్తాన్ని ఏరులైపారించిందన్నారు. ఇటీవల వెనిజుల దేశ అధ్యక్షుడు మధురో ఆయన భార్యను ఒక మిలిటరీ జర్నల్ ను అర్ధరాత్రి అధ్యక్ష భవనం పై దాడి జరిపి దొంగల్లాగా ఎత్తుకెళ్లారు. ప్రజలచే ఎన్నుకోబడ్డ, సర్వం సహధికారం కలిగిన ఒక దేశ అధ్యక్షుడి భవనం పై దాడి జరిపి అపహరించటం ఇది అమెరికా పశు బలానికి నిదర్శనం. కావున తక్షణమే ఇరాన్ పై దురాక్రమణ యుద్ధాన్ని ఆపివేసి మధురో ఆయన భార్యను విడుదల చేయాలి అని వెంకటేశ్వర్లు అన్నారు. IFTU జిల్లా అధ్యక్షుడు హెచ్ యాకయ్య మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాల స్థానంలో కార్మిక వ్యతిరేక నిరంకుశ నాలుగు లేబర్ కోడ్లను తెచ్చి ఉద్యోగ భద్రత లేకుండా చేయటమే కాకుండా ప్రశ్నించే వారిని గొంతు నొక్కుతుందని అన్నారు. పారిశ్రమలను ప్రైవేటుపరం చేయకుండా ప్రభుత్వ పరంగానే ఉంచి కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. పార్టీ నాయకుడు కామ్రేడ్ యడ్ల మల్లయ్య మాట్లాడుతూ కార్మిక వర్గం, పట్టణ పేద ప్రజలు, గ్రామీణ వ్యవసాయ కూలీలంతా ఎర్రజెండా నీడలో సంఘటి తంకాలనిపిలుపునిచ్చారు.

## "ఊయల", దత్తత సహాయక కేంద్రం ప్రారంభం



**మహబూబాబాద్, విశాలభారతి:** ప్రజా పాలన-ప్రగతి నివేదిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో "ఊయల" కార్యక్రమాన్ని, అలాగే ఐడీఓసి కలెక్టరేట్‌లో "దత్తత సహాయక కేంద్రం"ను జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ప్రారంభించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ మరియు జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ, పుట్టిన పిల్లలను పెంచలేని పరిస్థితుల్లో ఉన్నవారు వారిని చెత్త కుప్పల్లో లేదా ఇతర ప్రమాదకర ప్రదేశాల్లో వదిలేయకుండా, ప్రభుత్వం ఏర్పాటు చేసిన "ఊయల"లో అప్పగించాలని సూచించారు. ఈ విధంగా అప్పగించిన పిల్లలకు చట్టబద్ధంగా దత్తత కల్పిస్తామని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఆమె స్పష్టం చేశారు. దత్తతపై అవగాహన పెంపొందించేందుకు కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన దత్తత సహాయక కేంద్రం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ప్రతి సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొనే ప్రజలకు హెల్ప్ డెస్క్ ద్వారా దత్తతకు సంబంధించిన విధానం, అవసరమైన పత్రాలు, ప్రభుత్వ మార్గదర్శకాలు వంటి వివరాలు అందజేయనున్నట్లు చెప్పారు. వాత్సల్య పోర్టల్ ద్వారా ఆన్లైన్‌లో దత్తత నమోదు చేసుకోవాలని సూచించారు. అక్రమ దత్తతలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. చైల్డ్ సేఫ్టీ వారోత్సవాల సందర్భంగా 42 ప్రశ్నల ఆధారంగా పిల్లల వివరాలను సేకరించి, ఏడుగురు పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలోని అన్ని విభాగాలు పిల్లలు, మహిళలు, వృద్ధులు, సీనియర్ సిటిజన్ల సంక్షేమానికి షెడ్యూల్ ప్రకారం సేవలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవి రాథోడ్, ఇంచార్జ్ సంక్షేమ అధికారి శిరీష, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ నాగవాణి, ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఆర్ఎంఓ జగదీష్, బాల రక్ష భవన్ కోఆర్డినేటర్ రాజ్యలక్ష్మి, డీసీపీఓ కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

## సింగరాజు పల్లిలో చలివేంద్రం ప్రారంభం

**టీపీసీసీ అధ్యక్షులు ఝాన్సీ రాజేందర్ రెడ్డి**



**దేవరపులా, విశాలభారతి:** మండలం సింగరాజుపల్లి గ్రామంలో సర్పంచ్ కొండ ఊర్మిళ మల్లారెడ్డి ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని టిపిసిసి వైస్ ప్రెసిడెంట్ శ్రీమతి ఝాన్సీ రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని గ్రామస్తులకు మరియు ప్రయాణికులకు ప్రధాన చౌరస్తాలో చల్లని తాగునీరు అందించేందుకు ఈ చలివేంద్రం ఉపయోగ పడుతుందని ఆమె పేర్కొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో సేవా భావం పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని, ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయం అందించాలని సూచించారు. గ్రామ అవసరాలను గుర్తించి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ మండల అధ్యక్షులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, మరియు గ్రామస్తులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ పరామర్శలు

**బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం**



**మరిపెడ విశాలభారతి:** మరిపెడ మండలంలోని గిరిపురం గ్రామంలో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ పర్యటించి అనారోగ్యంతో బాధపడుతున్న వారికి పరామర్శలు అందించారు. గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు షేక్ యాకుబ్ పాషా మామ షైక్ ఇస్మాయిల్ ఇటీవల అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం ఇంటికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో ఆమె వారి నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అదే సమయంలో రూ.10,000 ఆర్థిక సహాయం అందించి కుటుంబానికి ధైర్యం చెప్పారు. అనంతరం అదే గ్రామానికి చెందిన బర్మావత్ సురేష్ ప్రమాదవశాత్తు మరణించగా, ఆయన భౌతిక దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సురేష్ కుటుంబ సభ్యులను ఓదార్చి, వారి దుఃఖాన్ని పంచుకున్నారు. కుటుంబానికి అండగా నిలుస్తూ రూ.5,000 ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బొడ శ్రీను నాయక్, పెదబోయిన రంగయ్య, షేక్ యాకుబ్ పాషా, యాకుబ్ పఠాన్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రజలు మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ చేసిన సహాయాన్ని అభినందించారు.

విశాల భారతి

# ప్రైవేటు పాఠశాలల నిలువు దోపిడీ

- తల్లిదండ్రుల ఆవేదన
- ఫీజుల పేరుతో లక్షల వసూలు
- ఎంఈఓ పర్యవేక్షణ లోపమే కారణమంటున్న వైనం

**శేరిలింగంపల్లి- విశాల భారతి**

శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని ప్రైవేటు పాఠశాలల తీరు తల్లిదండ్రులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. అడ్మిషన్ల సీజన్‌ను ఆసరాగా చేసుకొని యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా ఫీజుల పేరుతో నిలువు దోపిడీకి పాల్పడుతున్నాయని తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.


ప్రైవేట్ స్కూల్

**ఫీజుల దోపిడీ ఇలా..**

నర్సరీ, ఎల్‌కేజీ అడ్మిషన్లకే రూ.1.5 లక్షల నుంచి రూ.2.5 లక్షల వరకు వసూలు చేస్తున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డొనేషన్, బిల్డింగ్ ఫండ్, డెవలప్‌మెంట్ ఫీజు, స్పెషల్ ఫీజు, డిజిటల్ క్లాస్ రూమ్ ఫీజు పేరుతో విడివిడిగా లక్షల్లో గుంజుతున్నారని వాపోతున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల కంటే మూడు, నాలుగు రెట్లు అధికంగా వసూలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. యూనిఫామ్, టై, బెల్ట్, షూస్, పుస్తకాలు, నోట్ బుక్స్ అన్నీ పాఠశాలల్లోనే కొనాలని ఒత్తిడి చేస్తున్నారు. బయట మార్కెట్ ధర కంటే రెట్టింపు ధరకు అమ్ముతూ అదనపు భారం మోపుతున్నారని తల్లిదండ్రులు మండిపడుతున్నారు. రవాణా చార్జీల పేరుతోనూ భారీగా వసూలు చేస్తున్నారని విమర్శిస్తున్నారు.

**పర్యవేక్షణ కరవు**

ఈ వ్యవహారంపై మండల విద్యాశాఖాధికారి కార్యాలయం పర్యవేక్షణ పూర్తిగా లోపించిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రతి ఏటా ఫీజుల నియంత్రణకు కమిటీలు వేస్తున్నా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని చెబుతున్నారు. ఫిర్యాదులు చేసినా తూతూ మంత్రంగా విచారణ జరిపి వదిలేస్తున్నారని, దీంతో యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఫీజుల వివరాలను నోటీసు బోర్డులో ఉంచాలి. కానీ ఏ పాఠశాలా ఆ పని చేయడం లేదు. అడిగితే సీటు ఇవ్వం అని బెదిరిస్తున్నారు' అని ఓ తల్లి దండ్రుడు వాపోయాడు.

**చర్యలు తీసుకోవాలి**

జిల్లా విద్యాశాఖాధికారి వెంటనే స్పందించి నియోజకవర్గంలోని అన్ని ప్రైవేటు పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని, యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరుతున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల వివరాలను వెబ్‌సైట్‌లో ఉంచి పారదర్శకత పాటించేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


ప్రైవేటు పాఠశాలకు బ్యాగులు వేసుకొని వెళ్తున్న చిన్నారులు (ఫైల్ ఫోటో)

## మేడే సందర్భంగా కార్మికులతో ఐక్యంగా ముందుకు సాగుదాం

**పూలపల్లి కృష్ణారెడ్డి పిలుపు**



**రాజేంద్రనగర్, విశాలభారతి :** రాజేంద్రనగర్ నియోజకవర్గం గండిపేట్ మండలంలో ఈరోజు మేడే సందర్భంగా కార్మికులందరికీ గౌరవార్థం ఘనంగా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పూలపల్లి కృష్ణారెడ్డి గారు హాజరై, కార్మిక సంఘాల ప్రతినిధులతో కలిసి ఐక్యమత్యంతో ముందుకు సాగాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ — ప్రపంచ గమనానికి నిజమైన చైతన్యం ఇచ్చేది కార్మికుల కష్టం, వారి చెమట, వారి అంకితభావం అని పేర్కొన్నారు. మట్టిలో దాగి ఉన్న మాణిక్యాలను వెలికితీసి, రాళ్లను రత్నాలుగా మార్చే మహత్తర శక్తి ప్రతి కార్మికుడి చేతిలోనే ఉందని ఆయన కొనియాడారు. దేశ ఆర్థిక వ్యవస్థకు, సమాజ అభివృద్ధికి పునాది వేసేది కార్మికులేనని ఆయన స్పష్టం చేశారు. కార్మికులు కేవలం శ్రమజీవులు మాత్రమే కాకుండా, దేశ నిర్మాణ శిల్పులు అని పేర్కొంటూ, వారి హక్కుల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కలిసి కట్టుగా నిలబడాలని పిలుపునిచ్చారు. కార్మిక సంఘాలు పరస్పరం ఐక్యంగా ఉంటేనే వారి సమస్యలకు సరైన పరిష్కారం లభిస్తుందని, ప్రభుత్వంపై కూడా బలమైన ప్రభావం చూపగలమని ఆయన అభిప్రాయపడ్డారు. మేడే రోజున మనం కేవలం శుభాకాంక్షలు మాత్రమే కాకుండా, కార్మికుల సంక్షేమం కోసం కట్టుబడి ఉండాలని సంకల్పం చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రతి కార్మికుడికి సముచిత వేతనం, భద్రత, గౌరవం లభించే సమాజం నిర్మాణం కోసం అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పూలపల్లి కృష్ణారెడ్డి గారు అన్ని కార్మిక సంఘాలకు, శ్రమజీవులకు హృదయపూర్వక మేడే శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి కృషి మరింత అభివృద్ధి దిశగా సాగాలని ఆకాంక్షించారు. "కార్మికుల ఐక్యతే శక్తి - ఐక్యంగా ముందుకు సాగుదాం" అనే నినాదంతో ఈ కార్యక్రమం ఉత్సాహభరితంగా కొనసాగింది.

## రాష్ట్రానికి దేశానికి ఆయువుపట్టు కార్మిక వర్గమే..

**మాజీ బిఆర్ఎస్ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ జనరల్ సెక్రెటరీ జింకల మల్లేష్**



**ముషీరాబాద్,విశాలభారతి:** కార్మిక లోకమే దేశానికి రాష్ట్రానికి ఆయువు పట్టు లాంటి వారు అని మాజీ బిఆర్ఎస్ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ జనరల్ సెక్రెటరీ జింకల మల్లేష్ పేర్కొన్నారు. ఎన్నో పోరాటాలు త్యాగాలతోనే మేడే ఏర్పడిందని అన్నారు. ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే సందర్భంగా తార్నాక సండే మార్కెట్‌లో బి.ఆర్.టి.యు ఆటో యూనియన్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. శుక్రవారం యూనియన్ నాయకులు జోగు రాకేష్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకకు బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గ్రేటర్ హైదరాబాద్ మాజీ జనరల్ సెక్రటరీ జింకల మల్లేష్, ఆ పార్టీ సీనియర్ నాయకులు గుండెల్ని మధుకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్మికుల ఐక్యతను చాటి చెప్పే విధంగా ఆటో యూనియన్ మేడే పోస్టర్ను ఆటోకు అతికించి యూనియన్ జెండాను ఆవిష్కరించి ఫ్రూట్స్ స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం జింకల మల్లేష్ మాట్లాడుతూ రక్తం చిందించి.. చెమటను ధారపోసి, నవసమాజ నిర్మాణానికి వెన్నెముకలా శ్రామిక కార్మిక వర్గం నిలిచిందన్నారు శ్రామికుల అలుపెరగని చక్రాల పయనమే ప్రగతికి సోపానమని తెలిపారు. మే డే సందర్భంగా ఎగిరిన ఈ ఎర్రజెండా.. కార్మిక ఐక్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం కెసిఆర్ నాయకత్వంలో కార్మిక వర్గానికి అన్ని పథకాలు అందాయని తెలిపారు. సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ ఎల్లప్పుడు కార్మిక వర్గానికి అండగా ఉన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనగాం యాదగిరి, రాజ్ నరసింహ, అరుణ్, కాజా, యాకూబ్ షరీఫ్, మనోహర్,బంగారి సాయి కుమార్,గాదె వెంకటస్వామి, జి కొమురయ్య, జోగు బిక్షపతి, గాద బాబు, జి కృష్ణస్వామి, ఎం శ్రీనివాస్, జి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## మొయినాబాద్‌లో ఘనంగా మే డే ఉత్సవాలు

**మొయినాబాద్, విశాలభారతి:** సీఐటీయూ మొయినాబాద్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మే డే ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మొయినాబాద్ మున్సిపల్ కార్యాలయం వద్ద మొయినాబాద్ మున్సిపల్ చైర్మన్ సోనియా దర్శన్, సీఐటీయూ జెండాను ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో మొయినాబాద్ మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ పాల్గొని మే డే సందర్భంగా కార్మికుల సమస్యలు తెలుసుకొని వెంటనే పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. మున్సిపల్ చైర్మన్ సోనియా దర్శన్, కమిషనర్, కౌన్సిలర్లు మాణిక్యం, రామకృష్ణ గౌడ్, శంకరయ్య, పాల్గొని మేడే సందర్భంగా కార్మికులను సన్మానించారు. అలాగే సీఐటీయూ జెండాను మొయినాబాద్ పట్టణ కేంద్రంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కాడిగళ్ల భాస్కర్ ఎగురవేశారు. నాగిరెడ్డి గూడా అజీజ్ నగర్ చౌరస్తాలలో సీఐటీయూ జెండాలను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లీ దేవేందర్, మొయినాబాద్ మండల కన్వీనర్ సీహెచ్. ప్రవీణ్ కుమార్ మున్సిపల్ యూనియన్ గౌరవాధ్యక్షులు రత్నం, అధ్యక్షులు సుధాకర్, ప్రధాన కార్యదర్శి సురేష్, కోశాధికారి కృష్ణ , కేవీపీఎస్ నాయకులు జంగయ్య, ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అరుణ్ కుమార్, ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ సీఐటీయూ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శేఖర్, ఎస్ఎఫ్ఐ మొయినాబాద్ మండల కార్యదర్శి చరణ్ గౌడ్, సీఐటీయూ చేవెళ్ల నాయకులు జనార్ధన్, మున్సిపల్ యూనియన్ నాయకులు సీఐటీయూ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ టి.డబ్ల్యూ.ఏ.జీ.హెచ్.ఎస్ విద్యార్థుల ప్రభంజనం

- ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా 100% ఫలితాలతో మెరిసిన ప్రభుత్వ పాఠశాల
- పదో తరగతిలో 28 మంది విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత
- 11 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధన
- వరుసగా 2025, 2026 సంవత్సరాల్లో 100% ఫలితాలు

**అశ్వారావుపేట, విశాలభారతి :**

అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ టి.డబ్ల్యూ.ఏ.జీ.హెచ్.ఎస్ (గౌట్.టి.డబ్ల్యు ఏ.జి.హెచ్.ఎస్) పాఠశాల ఈ సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో అద్భుత ప్రదర్శనతో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా నిలిచింది. పరీక్షలకు హాజరైన మొత్తం 28 మంది విద్యార్థులు శాతం 100% ఫలితాలు సాధించడం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు కూడా ఏ మాత్రం తగ్గవని మరోసారి నిరూపించారు.ఈ ఫలితాల్లో ప్రత్యేకంగా 11 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించడం విశేషం. పాఠశాల టాపర్‌గా ఎన్. శిరీష 541 మార్కులు సాధించి మొదటి స్థానాన్ని కైవసం చేసుకోగా, వి. కావ్యశ్రీ 538 మార్కులతో ద్వితీయ స్థానం, కె. శ్రీలత 534 మార్కులతో తృతీయ స్థానం పొందారు.తక్కువ వనరులతోనూ నాణ్యమైన బోధనతో విద్యార్థులను ఉత్తమ ఫలితాలకు తీసుకెళ్లిన ఈ పాఠశాల ప్రైవేట్ విద్యాసంస్థలకు గట్టి పోటీగా నిలిచింది. గురువుల కృషి, విద్యార్థుల పట్టుదల ఈ విజయానికి కారణమని, 2025 మరియు 2026 సంవత్సరాల్లో 100% ఫలితాలు సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు బావుసింగ్ బానోత్ తెలిపారు.ఈ సందర్భంగా పాఠశాలలో ఆనందోత్సాహాల మధ్య విద్యార్థులను సన్మానించి, వారి విజయాన్ని ఘనంగా జరుపుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలు కూడా ఉత్తమ ఫలితాలు సాధించగలవని ఈ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి.




## పసుపును ఆహార పంటగా గుర్తించాలి

- క్వింటాల్ కు రూ.16 వేల మద్దతు ధర ప్రకటించాలి
- తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్, విశాలభారతి:**

పసుపును ఆహార పంటగా గుర్తించి క్వింటాల్ కు రూ.16 వేల మద్దతు ధర ప్రకటించాలని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నిజామాబాద్ కు చేరువగా మహారాష్ట్రలోని సాంగ్లి మార్కెట్ లో క్వింటాల్ పసుపునకు రూ.17 వేల ధర పలుకుతుందని తెలిపారు. నిజామాబాద్ మార్కెట్ లో వ్యాపారులు సిండికేట్ గా మారి రూ.13 వేలకు మించి ధర పెట్టడం లేదని, దీంతో పసుపు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్పైసెస్ బోర్డు ఉత్సవ విగ్రహంలా మారిందని.. స్పైసెస్ బోర్డును బలోపేతం చేసి నిజామాబాద్, జగిత్యాల, నిర్మల్ జిల్లాల్లోని పసుపు రైతులకు అండగా నిలవాలని కోరారు. వెంటనే ఆహార పంటల జాబితాలో పసుపును చేర్చి కనీస మద్దతు ధర ప్రకటించాలని కోరారు. నిజామాబాద్ మార్కెట్ లో ఇంకా లక్ష క్వింటాళ్లకు పైగా పసుపు పంట కొనుగోలు చేయాల్సి ఉందని, ఆ రైతులకు ప్రయోజనం చేకూర్చాలని కోరారు. ఇ - నామ్ 2.0 ప్రారంభ సమయంలో నిజామాబాద్ మార్కెట్ ను చేర్చకపోవడంతో పసుపు రైతులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారని గుర్తు చేశారు. తర్వాత ఇ - నామ్ 2.0లో నిజామాబాద్ మార్కెట్ ను చేర్చినా ఆన్ లైన్ లో వివరాలు నమోదు చేయడంలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పసుపు పంటకు గిట్టుబాటు ధర దక్కకపోవడంతోనే గడిచిన ఏడేళ్లుగా నిజామాబాద్, జగిత్యాల, నిర్మల్ జిల్లాల్లో పసుపు పంట సాగు విస్తీర్ణ గణనీయంగా పడిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పసుపు రైతులను ఆదుకునే చర్యలు చేపట్టాలని కోరారు.

## మహా ప్రతిష్ఠకు సిద్ధమైన సీతారామాంజనేయ స్వామి దేవాలయం





**పాల్వంచ విశాలభారతి:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం పుల్లాయిగూడెం గ్రామంలో భక్తుల సంకల్పంతో నూతనంగా నిర్మితమైన శ్రీ సీతారామాంజనేయ స్వామి వారి దేవాలయం ప్రతిష్ఠా మహోత్సవాలు మే 5 నుండి 8వ తేదీ వరకు ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. మే 5న మంగళవారం ఉదయం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనంతో దైవకార్యాలకు మంగళప్రారంభం జరగనుంది. అనంతరం హోమాలు, వేద మంత్రోచ్చారణల మధ్య వివిధ పూజలు నిర్వహించి ప్రాంతాన్ని పుణ్యమయం చేయనున్నారు. సాయంత్రం ప్రత్యేక దేవతా ఆరాధనలతో భక్తుల మనసులకు ఆధ్యాత్మిక ఆనందం కలిగించనున్నారు. మే 6న బుధవారం ఉదయం పూజలు కొనసాగించబడగా, మధ్యాహ్నం శ్రీ సీతారాముల దివ్య కల్యాణోత్సవం భక్తి భావంతో నిర్వహించబడుతుంది. సాయంత్రం వేదపారాయణాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తులను ధ్యానంలో ముంచెత్తనున్నాయి. మే 7న గురువారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి, మధ్యాహ్నం ప్రతిష్ఠా మహోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తిచేయనున్నారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు భక్తి సందేశాలను విస్తరింపజేయనున్నాయి. మే 8న శుక్రవారం ప్రధాన కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరుగనున్నాయి. ఉదయం 5 గంటల నుండి శుభకార్యాలు ప్రారంభమై, ఉదయం 9 గంటల 44 నిమిషాలకు వేదఘోషల నడుమ మహా ప్రతిష్ఠా కార్యక్రమం నిర్వహించబడుతుంది. అనంతరం ధ్వజస్తంభ ప్రతిష్ఠతో ఆలయ మహోత్సవానికి శ్రీకారం చుడనున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుండి అన్నదానం నిర్వహించి భక్తులకు ప్రసాదం అందించనున్నారు. ఈ పుణ్యకార్యాల్లో పాల్గొనడం ద్వారా ఆధ్యాత్మిక శాంతి, దైవ అనుగ్రహం లభిస్తాయని విశ్వసిస్తూ, గ్రామస్తులు, పరిసర ప్రాంతాల భక్తులు కుటుంబ సమేతంగా విచ్చేసి స్వామివారి కృపాకటాక్షాలు పొందాలని గ్రామస్తులు భక్తిపూర్వకంగా ఆహ్వానిస్తున్నారు.

## శ్రీల గార్డెన్‌లో పాదయాత్ర సమస్యల పరిశీలన

**కాలనీవాసులతో కలిసి మాజీ కార్పొరేటర్ శ్రీకాంత్ పర్యటన**



**శేరిలింగంపల్లి విశాలభారతి:** మియాపూర్ డివిజన్ శ్రీల గార్డెన్ కాలనీలో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ కాలనీవాసులతో కలిసి పాదయాత్ర చేశారు.ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ, "కాలనీలోని సమస్యలను స్వయంగా పరిశీలించాం. చిన్న సమస్యలను అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరించాం. రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం. కొత్త డ్రైనేజీ లైన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం" అని అన్నారు.పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ సహకారంతో మంజూరైన పనులను విడతలవారీగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని తెలిపారు.కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు ఫణి కుమార్, ప్రవీణ్ కుమార్, విశ్వనాథ్, జగదీశ్, జస్వంత్, కేశవప్రసాద్, కృష్ణారావు, నాగేశ్వరరావు, రమేష్, రాఘవ రెడ్డి, చేతన్, గోపాల్, అభినయ్, మధు, హరనాథ్, రాంబాబు, సాయిబాబా, మహేష్ తదితర కాలనీవాసులు పాల్గొన్నారు.

## కాకతీయ హైస్కూల్లో పదవ తరగతి ఫలితాల్లో ప్రభంజనం



**కూకట్పల్లి విశాలభారతి:** పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ఎప్పుడూ ముందుండి తనకంటూ ఒక ప్రత్యేక సత్తా చాటిన జగద్గిరిగుట్ట కాకతీయ టెక్నో స్కూల్లో ఈ సారి చరిత్రలో మొదటిసారిగా 583 మార్కులు సాధించి తన ప్రతిభను చాటిన విద్యార్థిని దొగిపర్తి దేదీప్య. ఈ సందర్భంగా ప్రథమ ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులను వారి తల్లిదండ్రులను ఘనంగా సత్కరించారు.ప్రథమ స్థానంలో నిలిచి 583 మార్కులు సాధించిన దొగిపర్తి దేదీప్య ను వారి తల్లిదండ్రులు దొగిపర్తి శ్రీనివాస్ నాగమణి లను, ద్వితీయ స్థానంలో నిలిచి 561 మార్కులు సాధించిన పద్దాని వెన్నెల వారి తల్లిదండ్రులు పద్దాని జనార్దన్ నిర్మలను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ మాట్లాడుతూ నిరంతరం అధ్యాపకుల కఠోర శ్రమ విద్యార్థుల కృషి పట్టుదల తల్లిదండ్రుల ప్రోత్సాహం అందరి సమిష్టి కృషి వల్ల ఈ ఫలితాలు వచ్చాయని అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. వీరితోపాటు ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో పాటు పూర్తిస్థాయి ఉత్తీర్ణత శాతం సాధించినందుకు అధ్యాపకులకు విద్యార్థిని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానంలో నిలుస్తారని భవిష్యత్తులో వారు ఉన్నత స్థానంలో నిలబడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్స్ పి తిరుపతి రావు,ఎ రామేశ్వర్ రావు, పి.సురేష్, ఎస్ శ్రీధర్, రవీంద్ర బాబు, ప్రిన్సిపాల్ కె.ఎస్. ఎన్.మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ టి.పరమేశ్వరి, పి.కవిత ఎం.దుర్గా భవాని, మేరీ,విజయలక్ష్మి, ఆనంద్ మదిలెట్టి, సింధూర్ ప్రబంధన్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే రంగారెడ్డి

**ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే.. నియోజకవర్గంలోని దేవాలయాల అభివృద్ధికి హామీ**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** ఇబ్రహీంపట్నం మండలం పోచారం గ్రామంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించబడింది. ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో సేవలందించారు. అనంతరం భక్తులతో కలిసి కళ్యాణోత్సవంలో పాల్గొని స్వామివారి ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రతి దేవాలయాన్ని అభివృద్ధి చేయడానికి కట్టుబడి ఉన్నామని, భక్తులకు మరింత సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జహంగీర్‌కు 'శ్రమ శక్తి' అవార్డు

**మే డే వేళ మంత్రి వివేక్ చేతుల మీదుగా సత్కారం**






**హైదరాబాద్, విశాలభారతి:** వాటర్ వర్క్స్ ఎంప్లాయీస్ యూనియన్ అసోసియేట్ ప్రెసిడెంట్, సీనియర్ ట్రేడ్ యూనియన్ నాయకుడు ఎండి జహంగీర్‌కు 'శ్రమ శక్తి' అవార్డు లభించింది.మే డే సందర్భంగా రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక మంత్రి వివేక్ ఈ అవార్డును ప్రదానం చేశారు.ఈ సందర్భంగా జహంగీర్ మాట్లాడుతూ, "రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అవార్డు రావడం సంతోషం. ఇది కార్మికుల ద్వారా లభించిన గౌరవం" అని అన్నారు.కార్యక్రమంలో టీజేఈయూ అధ్యక్షుడు మొగుళ్ల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రాఘవేంద్ర రాజు, వాటర్ వర్క్స్ యూనియన్ అధ్యక్షుడు కె.రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి శేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండి హాషం, చీఫ్ వైస్ ప్రెసిడెంట్ ఎండి గౌస్, కె.రవిశేఖర్ రెడ్డి, కోశాధికారి శ్రీనివాస్ యాదవ్, కె.నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. భారీ సంఖ్యలో కార్మికులు హాజరయ్యారు.

## మే డే స్ఫూర్తితో మున్సిపల్ కార్మికుల పోరాటాలకు పిలుపు

**రాష్ట్ర ముఖ్యమంత్రి ఇంటికి పాదయాత్ర నిర్వహిస్తామని హెచ్చరిక**



**రాజేంద్రనగర్, విశాలభారతి :** అంతర్జాతీయ కార్మిక దినోత్సవం (మే డే) సందర్భంగా రాజేంద్రనగర్ మండల కేంద్రంలో ఘనంగా కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ కాంట్రాక్ట్ మరియు ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏఐటీయూసీ మండల ప్రధాన కార్యదర్శి టి. ఆనంద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మైలార్ దేవ్‌పల్లి చౌరస్తా మరియు రాజేంద్రనగర్ మున్సిపల్ జోన్ కార్యాలయం వద్ద జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వనంపల్లి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ, చికాగోలో జరిగిన కార్మిక ఉద్యమాలను గుర్తుచేస్తూ, ప్రపంచ కార్మికులు ఏకమై పోరాడి 8 గంటల పని చట్టం, కనీస వేతనాలు వంటి హక్కులను సాధించుకున్నారని తెలిపారు. అయితే ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లతో కార్మిక హక్కులు బలహీనపరచబడుతున్నాయని విమర్శించారు. ఈ కోడ్లను రద్దు చేసే వరకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరంతర పోరాటాలు కొనసాగుతాయని ఆయన హెచ్చరించారు. మున్సిపల్ కార్మికుల సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పర్మనెంట్ చేయాలని, అప్పటి వరకు కనీస వేతనం రూ.26,000 అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం మే నెలలో మున్సిపల్ కార్మికులతో కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి ఇంటికి పాదయాత్ర నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు వై. సాయిలు, ఉపాధ్యక్షులు ఏ. రాజు, ఈశ్వర్, శ్రీను, శేఖర్, నరసింహ, రమేష్, సురేష్, జాషువా, సంగీత, సంతోష, పుష్పమ్మ, సునీత, నాగమ్మ తదితరులు మరియు పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ శక్తులను పెంచి పోషిస్తున్న మోడీ

- మేడే స్ఫూర్తితో భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలి – సిపిఎం పిలుపు
- లేబర్ కోడ్‌లు తక్షణమే రద్దు చేయాలని కార్మిక వర్గం డిమాండ్
- మేడే సందర్భంగా సత్తుపల్లిలో భారీ ర్యాలీ, జెండా ఆవిష్కరణలు
- 8 గంటల పని విధానాన్ని తగ్గించి 5 రోజుల పని వారానికి మార్పు కోరింపు



**సత్తుపల్లి, విశాలభారతి :**

సిపిఎం సత్తుపల్లి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మేడే దినోత్సవం సందర్భంగా సిపిఎం పార్టీ కార్యాలయం వద్ద సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మోరంపూడి పాండురంగారావు, సిపిఎం డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణ రెడ్డి జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం గోల్డ్ స్పాట్ కంపెనీ వద్ద మేడే ప్రారంభోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ చేసి ఉత్సవాలను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో భాగంగా సత్తుపల్లిలో వివిధ కార్మిక వర్గ అడ్డా కేంద్రాల వద్ద మేడే జెండాలను ఆవిష్కరిస్తూ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ముగింపు సందర్భంగా సత్తుపల్లి టింబర్ యార్డ్‌లో జరిగిన సమావేశం సిపిఎం సత్తుపల్లి పట్టణ కార్యదర్శి కొలికపోగు సర్వేశ్వరరావు అధ్యక్షతన జరిగింది.ముగింపు సభలో సిపిఎం డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణ రెడ్డి, జిల్లా నాయకులు మోరంపూడి పాండురంగారావు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ సారథ్యంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులను పెంచి పోషిస్తోందని ఆరోపించారు. ప్రైవేట్ కంపెనీల యాజమాన్యాలు వారానికి 70 నుండి 90 గంటల పని విధానాన్ని అమలు చేయాలనే ఉద్దేశంతో కార్మిక చట్టాలలో మార్పులు చేయాలని చూస్తున్నాయని తెలిపారు.ఆధునిక యంత్రాల వలన తక్కువ పనితో ఎక్కువ ఉత్పత్తి జరుగుతున్న తరుణంలో 8 గంటల పని విధానాన్ని 7 గంటలకు, 6 రోజుల పనిని 5 రోజులకు కుదించాలని కార్మిక వర్గం డిమాండ్ చేస్తోందని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం నాటి నుండి కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చే ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు.సామాన్య ప్రజలపై భారాలు మోపుతూ కార్పొరేట్ శక్తులకు రాయితీలు కల్పిస్తున్న విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ధరలను అదుపు చేయడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, క్రూడ్ ఆయిల్ ధరలు నియంత్రణలో ఉన్నప్పటికీ గ్యాస్, పెట్రోల్ ధరలను నిరంతరం పెంచుతూ ప్రజలపై భారాలు మోపుతోందని విమర్శించారు.మే డే కేవలం సెలవు దినం కాదని, కార్మికుల శ్రమ గౌరవం, ఐక్యత, సామాజిక న్యాయం గుర్తు చేసే రోజు అని తెలిపారు. కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేస్తున్న మోడీ ప్రభుత్వంపై భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. ఉదారవాద, కార్పొరేట్, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు నిర్మించుకోవాల్సిన అవసరం ఉందని, మేడే స్ఫూర్తితో కార్మిక వర్గం కదం తొక్కాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రావుల రాజబాబు, మోరంపూడి వెంకట్రావు, చావా రమేష్, ఓలేటి శ్రీహరి, పాకలపాటి మల్లికార్జున్, పాకలపాటి శ్రీనివాస్, గోల్డ్ స్పాట్ యూనియన్ నాయకులు మట్టపర్తి సత్యనారాయణ, కుమార్, శంకర్, దస్తగిరి, జి ముతేష్, వెంకటేశ్వరరావు, ప్రసాద్, హమాలి భాష, శ్రీను, హమాలి నాయకులు ఎస్కే వలి, బడే మియా, సైదా వెంకటేశ్వరరావు, ఆటో యూనియన్ నాయకులు మస్తాన్, యాకోబ్, రాంబాబు, రిక్షా యూనియన్ నాయకులు రంగయ్య, కుమార్, నాగేశ్వరరావు, ఆర్టీసీ యూనియన్ నాయకులు ప్రభాకర్, కృష్ణారెడ్డి, జగన్నాథం, దొరబాబు, ఓల్డ్ టాక్సీ రాంబాబు, శ్రీను, రంగారావు, న్యూ టాక్సీ యూనియన్ నాయకులు, ప్రైవేట్ స్కూల్ బస్ డ్రైవర్ సీనియర్ నాయకులు జి రాము, సత్యనారాయణ, మహేష్, నందు, కృష్ణ, రవి, ఎలక్ట్రిసిటీ చెరుకు శ్రీను, టింబర్ డిపో నాయకులు కాలం రామకృష్ణ, మారేష్, నాగరాజు, కాలు, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, రమేష్, సురేష్, మహిళా సంఘం నాయకులు పాకలపాటి ఝాన్సీ, రాజ్యలక్ష్మి, రజిని, సుబ్బలక్ష్మి, అభినవి, సింగరేణి యూనియన్ నాయకులు ముత్యాల కార్తీక్ పాల్గొన్నారు.

## శిల్పారామంలో భరతనాట్య సందడి

**హరిణి గౌతమ్ శిష్యబృందం అలరించిన ప్రదర్శన**



**శేరిలింగంపల్లి విశాలభారతి:** శిల్పారామం మాదాపూర్‌లో గురువారం సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. హరిణి గౌతమ్ శిష్య బృందం భరతనాట్య ప్రదర్శనతో ప్రేక్షకులను మెప్పించింది.కళాకారులు హారిక, వాగ్దేవి, కీర్తన, హంవీక, దివిష, లక్ష్మి వర్షిక, శ్రీ పర్ణిక, నక్షత్ర, మాన్విక రెడ్డి, పూర్వి, నైనికా, దాక్షాయణి, తులసి తదితరులు పాల్గొన్నారు. పుష్పాంజలి, మూషిక వాహన, మహా గణపతిమ్, భాగ్యదా లక్ష్మి, శ్రీ హరి స్తోత్రం, నటేశకౌతం, గరుడ గమన, అచ్యుత కేశవం, మహాలక్ష్మి అష్టకం, భో శంభో, తిల్లాన, అష్టలక్ష్మి స్తోత్రం, మంగళం వంటి అంశాలను లయబద్ధంగా ప్రదర్శించి ఆహూతుల ప్రశంసలు అందుకున్నారు.

## ఓఆర్‌పై ఘోర రోడ్డు ప్రమాదం

**ఆరుగురు దుర్మరణం.. ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు .. మృతుల్లో ఇద్దరు చిన్నారులు**



**సైబరాబాద్, విశాలభారతి:** హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై శుక్రవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందగా, ఒక చిన్నారి తీవ్రంగా గాయపడింది. స్థానికులు తీపిన వివరాల ప్రకారం.. ఓఆర్ఆర్ 16వ ఎగ్జిట్ పాయింట్ వద్ద లారీ రోడ్డు పక్కన ఆగి ఉంది. యాదగిరిగుట్ట వైపు నుంచి వస్తున్న కారు (TS 23F 2298) అతివేగంతో లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. కారు సగభాగం లారీ కిందకు దూసుకెళ్లింది. కారులో మొత్తం ఏడుగురు ప్రయాణిస్తున్నారు. వీరిలో ఆరుగురు సంఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు.మృతుల్లో ఇద్దరు చిన్నారులు ఉన్నారు. మరో చిన్నారి తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది.సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. క్రేన్ సాయంతో కారును బయటకు తీశారు. అతివేగమే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.ఓఆర్‌పై ఆగి ఉన్న వాహనాలను ఢీకొట్టి ప్రమాదాలు జరగడం తరచూ జరుగుతుండటంతో వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

## శ్రమను గౌరవిద్దాం

**పీఏసీ చైర్మన్ గాంధీ .. పారిశుద్ధ్య మహిళలకు చీరల పంపిణీ**



**శేరిలింగంపల్లి , విశాలభారతి:** అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా శ్రమను గౌరవిద్దాం, గుర్తిద్దాం, శ్రమ చేద్దామని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ పిలుపునిచ్చారు.చందానగర్‌లో మిరియాల రాఘవ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మిరియాల రాఘవరావు ఆధ్వర్యంలో పారిశుద్ధ్య సిబ్బందికి చీరల పంపిణీ కార్యక్రమం జరిగింది. తాజా మాజీ కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్‌తో కలిసి గాంధీ చీరలు పంపిణీ చేశారు.చికాగోలో 8 గంటల పని కోసం మొదలైన పోరాటమే నేడు మే డే అయింది. శ్రామిక శక్తిని మించిన ఆస్తి లేదు. రక్తాన్ని స్వేదంగా మార్చి అభివృద్ధి మెట్లుగా మలిచే కార్మిక శక్తికి వందనం" అని గాంధీ అన్నారు. కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని, పారిశుధ్య సిబ్బంది సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. కరోనా సమయంలో, నిత్యం కాలనీలను శుభ్రంగా ఉంచుతున్న వారి ఆరోగ్య భద్రత మన బాధ్యత అని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రవీందర్ రావు, మిరియాల రాఘవరావు, రఘునందన్ రెడ్డి, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, మిరియాల ప్రీతం, రాజన్, శ్రీహరి, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రమకు సెల్యూట్

- కార్మికుడు ఆలీకి ఆటో బహుమతి.. మే డే నాడు స్టీరింగ్ పట్టిన అనీల్ యాదవ్
- ఆటో కార్మికుడు అలీ మొహంలో ఆనందం



**శేరిలింగంపల్లివిశాలభారతి:** మే డే అంటే కేవలం జెండా ఎగరేయడం కాదు, శ్రమకు విలువ ఇవ్వడం. దీన్ని నిజం చేస్తూ శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు అనిల్ కుమార్ యాదవ్ లింగంపల్లి ఆటో డ్రైవర్ ఆలీకి కొత్త ఆటోను బహూకరించి కార్మిక దినోత్సవానికి సరికొత్త అర్థం చెప్పారు. మసీద్ బండలోని తన నివాసంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆటో తాళాలను ఆలీకి అందజేశారు. "రోజూ స్టీరింగ్ పట్టుకుని కుటుంబాన్ని నడిపే ఆటో కార్మికుడి కష్టం నాకు తెలుసు. ఈ ఆటో అతని బతుకు బండిని కొంచెం సులువుగా నడిపిస్తుందని ఆశిస్తున్నా" అని అనిల్ కుమార్ యాదవ్ ఈ సందర్భంగా అన్నారు. అంతకు ముందు నియోజకవర్గంలోని పలు ఆటో స్టాండ్లలో కార్మికులతో కలిసి ఐఎన్‌టీయూసీ జెండాను ఆవిష్కరించారు. "కార్మికుల చెమట చుక్కే దేశానికి పునాది. ఆర్టీసీ కార్మికుల విలీన ప్రక్రియతో ప్రజాప్రభుత్వం తన చిత్తశుద్ధిని చాటుకుంది. వ్యవస్థీకృత, అసంఘటిత కార్మికులందరికీ అండగా ఉంటాం" అని కార్మికులకు భరోసా ఇచ్చారు.టీపీసీసీ కార్యదర్శి సామల్ కార్తీక్ మాట్లాడుతూ, "ఆటో, బల్దియా కార్మికుల సమస్యలపై స్పందించే నాయకుడు అనిల్ కుమార్ యాదవ్. ఆయన చేస్తున్న సేవలు అభినందనీయం" అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో మహేష్ కుమార్ యాదవ్, ఎండి అజామ్, కోడిచర్ల మహేందర్, గోపాల్, ఎండి ఇమ్రాన్, నాగరాజ్, విజయ్, ఆకాష్, రోహిత్ గౌడ్, లావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కూతురిపై అఘాయిత్యం

- తండ్రికి 20 ఏళ్ల జైలు శిక్ష



**సైబరాబాద్ విశాలభారతి:** కన్నకూతురిపై అఘాయిత్యానికి పాల్పడిన కేసులో తండ్రికి మేడ్చల్ స్పెషల్ పోక్సో కోర్టు 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించినట్లు జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ గురువారం తెలిపారు. బాధితురాలికి రూ.3 లక్షల పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశించిందన్నారు.ఇన్‌స్పెక్టర్ వెల్లడించిన వివరాల ప్రకారం.. నిందితుడు అస్గర్ అలీ, 37, బీహార్ రాష్ట్రం బక్సర్ జిల్లా, బర్కా సింఘన్‌పురా వాసి. కూలి పనుల కోసం 2019లో హైదరాబాద్‌కు వచ్చి గంపల్ల బస్తీ, సుభాష్‌నగర్‌లో కుటుంబంతో నివాసం ఉంటున్నాడు.గత ఏడాది మే 6న బాధితురాలి తల్లి జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తన భర్త అస్గర్ అలీకి మద్యం అలవాటు ఉందని, తరచూ గొడవ పడేవాడని తెలిపింది. ఇంటికి భోజనానికి వచ్చిన సమయంలో చిన్న కూతురు చెప్పడంతో విషయం బయటపడిందని పేర్కొంది.15 ఏళ్ల పెద్ద కూతురిపై రెండు నెలల క్రితం, మళ్లీ వారం క్రితం శుక్రవారం రోజున నిందితుడు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. చిన్న కూతురిని షాపునకు పంపి ఈ దారుణానికి ఒడిగట్టాడు. నిందితుడి బెదిరింపుల కారణంగా బాలికలు ఈ విషయాన్ని ఎవరికీ చెప్పలేదు. తల్లి నిలదీయడంతో నిందితుడు దాడికి దిగి, పొరపాటున జరిగిందని చెప్పి ఇంటి నుంచి పారిపోయాడు. ఫిర్యాదు అందుకున్న వెంటనే కేసు నమోదు చేసి మే 8న నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ తెలిపారు. సాక్ష్యాధారాలతో ఛార్జ్‌షీట్ దాఖలు చేసి త్వరితగతిన విచారణ పూర్తి చేయించామన్నారు.మేడ్చల్ ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టు న్యాయమూర్తి కె. వెంకటేష్ విచారణ జరిపి నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.35 వేల జరిమానా విధించారని చెప్పారు. సంవత్సరంలోపే తీర్పు రావడం గమనార్హమన్నారు.

## హైదర్‌నగర్‌లో ఘనంగా మే డే సంబరాలు

- అంబేడ్కర్ విగ్రహం వద్ద జెండా ఆవిష్కరణ



**హైదర్‌నగర్ విశాలభారతి:** కార్మికుల దినోత్సవం మే డేను పురస్కరించుకొని హైదర్‌నగర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం మే డే సంబరాలను ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ మైనారిటీ నాయకుడు ఎంఏ ఖదీర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నక్క శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, కార్మిక నాయకులు, స్థానికులు పాల్గొన్నారు. కార్మిక జెండాను ఆవిష్కరించి కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు.ప్రపంచ కార్మికుల పోరాట ఫలితమే మే డే. ఎనిమిది గంటల పని దినం కోసం చికాగోలో కార్మికులు చేసిన త్యాగం చిరస్మరణీయం. కార్మికుల హక్కుల సాధన కోసం, సంక్షేమం కోసం బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుంది' అని నాయకులు పేర్కొన్నారు. అసంఘటిత కార్మికుల సమస్యల పరిష్కారానికి, వారి సంక్షేమానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.కార్యక్రమంలో డివిజన్ నాయకులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, యువజన విభాగం సభ్యులు పాల్గొన్నారు.

## సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా మేడే ఉత్సవాలు



**బోడుప్పల్, విశాలభారతి:**

బోడుప్పల్ సర్కిల్ 11వ డివిజన్ ఇందిరా నగర్ కాలనీ చౌరస్తాలో సిపిఐ పార్టీ మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చ కిషన్ ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలు నిర్వహించడం జరిగినది. ఇందిరానగర్ కాలనీ చౌరస్తాలో సిపిఐ పార్టీ మరియు ఏఐటీయూసీ జండాలను సీనియర్ నాయకులు విబి బాలరాజ్ మరియు దండ రమేష్‌లు జండా ఆవిష్కరణ చేయడం జరిగినది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రచ్చ కిషన్ మాట్లాడుతూ. ప్రతి సంవత్సరం మే 1వ తేదీన ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది శ్రామికులు అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని — అంటే మేడేని — గర్వంగా జరుపుకుంటారు. ఈ మేడే 1886వ సంవత్సరం అమెరికాలోని చికాగో నగరంలో లక్షలాది కార్మికులు రోజుకు 16 నుండి 18 గంటలు పని చేయవలసిన దుర్భర పరిస్థితుల్లో ఉన్నారు. "రోజుకు 8 గంటలు పని, 8 గంటలు విశ్రాంతి, 8 గంటలు మన కోసం" అనే నినాదంతో కార్మికులు మే 1న సమ్మె బాట పట్టారు. వేల మంది కార్మికులు చికాగో వీధుల్లో శాంతియుతంగా నిరసన ప్రదర్శన చేపట్టారు. మే 4వ తేదీన హే మార్కెట్ స్క్వేర్‌లో జరిగిన సభలో పోలీసులు మూకపై లాఠీలు ఝుళిపించారు. అనామక వ్యక్తి ఒక బాంబు విసిరాడు — పోలీసులు కాల్పులు జరిపారు. అనేక మంది కార్మికులు అమరులయ్యారు. ఆ నాయకులకు ఉరిశిక్ష విధించారు. అయితే వారి బలిదానం వ్యర్థం కాలేదు.1889లో పారిస్‌లో జరిగిన రెండవ అంతర్జాతీయ కార్మిక సమావేశం మే 1వ తేదీని అధికారికంగా అంతర్జాతీయ కార్మిక దినోత్సవంగా ప్రకటించింది. నేడు 80కి పైగా దేశాలు ఈ రోజును జాతీయ సెలవు దినంగా పాటిస్తున్నాయి. భారతదేశంలో తొలిసారి మే డే 1923లో చెన్నైలో జరుపుకున్నారు. కార్మిక నాయకుడు సింగారవేలర్ నేతృత్వంలో నిర్వహించిన ఆ కార్యక్రమంలో మొదటిసారి ఎర్రజెండా రెపరెపలాడింది. అప్పటి నుండి ఈ దేశంలో కార్మికుల ఉద్యమం బలపడుతూ వచ్చింది. తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు మేడిపల్లి మండలం సిపిఐ పార్టీ సహాయ కార్యదర్శిలు సిహెచ్ మాధవి, జి నాగరాజు, బీసీ సంఘం జిల్లా నాయకులు కే ప్రమీల, బాపురాజు, బి కే ఎం యు మండల కార్యదర్శి & అధ్యక్షులు కే మహాలక్ష్మి ,భూతం ఐలయ్య, మండల కౌన్సిల్ సభ్యులు నరసమ్మ, దండు మదర్, తమన్నా,సిపిఐ పార్టీ నాయకులు ఇస్తారి, సోమరాజు, వెన్నెల ఆటో సంఘం అధ్యక్షులు జి యాకయ్య, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఆర్‌ఎస్‌లోకి మాజీ మంత్రి బోడ జనార్ధన్

- టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితతో భేటీ
- త్వరలోనే అనుచరులతో కలిసి పార్టీలో చేరనున్న మాజీ మంత్రి



**హైదరాబాద్, విశాలభారతి:**

మాజీ మంత్రి, సీనియర్ నాయకుడు బోడ జనార్ధన్ తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) లో చేరనున్నారు. శుక్రవారం బంజారాహిల్స్ లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను మర్యాదపూర్వకంగా కలిశారు. త్వరలోనే తన అనుచరులతో కలిసి టీఆర్ఎస్ లో చేరుతానని తెలిపారు. సింగరేణి బొగ్గు గనుల ప్రాంతంలో టీఆర్ఎస్ ను బలోపేతం చేసేందుకు తన వంతుగా కృషి చేస్తానని పేర్కొన్నారు. బోడ జనార్ధన్ ప్రస్తుత మంచిర్యాల జిల్లా చెన్నూరు శాసన సభ నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఎన్ టీ రామారావు ప్రభుత్వంలో కార్మిక శాఖ మంత్రిగా పని చేశారు.

## భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ



**విశాలభారతి, యాదగిరిగుట్ట:**

శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం యాదగిరిగుట్ట లో శుక్రవారం స్వాతి నక్షత్రం గిరిప్రదక్షిణ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఇందులో భాగంగా కొండ కింద గిరి ప్రదక్షణ ప్రారంభ స్థలమైనటువంటి గోపురం వద్ద శ్రీ స్వామివారి పాదాలను ప్రతిష్ఠించి శ్రీ స్వామి వారి పాదాలకు శాస్త్రానుసారముగా పూజా కార్యక్రమాలు నిర్వహించి నిత్య గిరిప్రదక్షిణను ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్య, దేవస్థానం టెంపుల్ ఈవో భవాని శంకర్ ప్రారంభించారు. సుమారు 20 నుండి 30 వేల మంది భక్తులు గిరి ప్రదక్షణలో పాల్గొన్నారు. ఈ క్షేత్రం పంచనరసింహ క్షేత్రం అయినందున అందునా పంచనారసింహస్వామి వారలలో ఒకరైన ఉగ్ర నరసింహ స్వామి వారు సూక్ష్మ రూపంలో కొండతా వ్యాపించినట్లు క్షేత్ర మహత్యం పురానోక్తి అయిఉన్నందున మరింత మహిమాన్వితమై ఉన్నది. గిరి ప్రదక్షిణ చేయడం వల్ల ఏడు జన్మల పాపాలు తొలగిపోతాయని,మనసులోని కోరికలు నెరవేరతాయని భక్తుల విశ్వాసము. ఇట్టి గిరి ప్రదక్షిణలో పాల్గొని శ్రీ స్వామి వారి అనుగ్రహం తో పాటు ఆధ్యాత్మిక, మానసిక ప్రశాంతత పొందుచున్నామని అనేక మంది భక్తులు ఈ సందర్భంగా తమ అనుభూతిని వ్యక్తపరిచారు. భక్తుల నుండి విశేష స్థాయిలో ప్రాచుర్యం పొందినందున భక్తుల అభీష్టము మేరకు స్వాతి నక్షత్రం నుండి భక్తులు కోరిన విధముగా నిత్య గిరి ప్రదక్షిణ సదుపాయాన్ని ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య ఆధ్వర్యంలో అందుబాటులోకి తేవడం జరిగినది. కార్యక్రమంలో దేవస్థాన అనువంశిక ధర్మకర్త భాస్కరాయని నరసింహా మూర్తి , ప్రధాన అర్చక, వేదపండితులు, మరియు విశేష స్థాయిలో భక్తులు పాల్గొని ఉన్నారు.



## డ్రగ్స్, సైబర్ నేరాల అదుపునకే ప్రాధాన్యం

**ఎఫ్‌సీ సీపీ తరుణ్ జోషి**



**సైబరాబాద్ విశాలభారతి:** ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ సీపీగా తరుణ్ జోషి శుక్రవారం తుక్కుగూడలో బాధ్యతలు స్వీకరించారు. కమిషనరేట్ కార్యాలయంలో అధికారుల సమక్షంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు.కమిషనరేట్ పరిధిలో మౌలిక సదుపాయాలు, సిబ్బంది నియామకంపై ప్రత్యేక దృష్టి సారిస్తా. ప్రాథమిక పోలీసింగ్, శాంతిభద్రతల పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తాం' అని సీపీ తరుణ్ జోషి తెలిపారు. డ్రగ్స్ నివారణ, సైబర్ నేరాల అదుపునకు మొదటి ప్రాధాన్యం ఇస్తామని స్పష్టం చేశారు. ప్రజల విశ్వాసాన్ని పొందేలా పారదర్శకమైన సేవలు అందిస్తామని, బాధితులకు సత్వర న్యాయం అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. టెక్నాలజీని ఉపయోగించి నేరాల నియంత్రణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చేపడతామన్నారు. రౌడీషీటర్లు, అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. బాధ్యతల స్వీకరణ అనంతరం కమిషనరేట్ పరిధిలోని డీసీపీలు, ఏసీపీలు, సీఐలతో సీపీ సమీక్ష నిర్వహించారు. పెండింగ్ కేసులు, నేరాల నమోదు తీరు, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో మర్యాదగా వ్యవహరించాలని ఆదేశించారు.

## మల్కాజిగిరి సీపీగా బుడుగుల సుమతి బాధ్యతల స్వీకరణ

**పారదర్శక పోలీసింగ్, ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం లక్ష్యం**



**సైబరాబాద్ విశాలభారతి:** మల్కాజిగిరి పోలీస్ కమిషనర్‌గా బుడుగుల సుమతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కమిషనరేట్ కార్యాలయంలో అధికారుల సమక్షంలో ఆమె బాధ్యతలు చేపట్టారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తా. ప్రజలకు పారదర్శకమైన,జవాబుదారీతనంతో కూడిన పోలీసింగ్ అందించడమే నా లక్ష్యం' అని సీపీ బుడుగుల సుమతి తెలిపారు. నేరాల నియంత్రణ, మహిళల భద్రత, సైబర్ నేరాల కట్టడిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు అన్ని పోలీస్ స్టేషన్లలో 'ప్రజా వినతుల పరిష్కార వ్యవస్థ'ను బలోపేతం చేస్తామని చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి పోలీసింగ్‌ను మరింత ప్రజలకు చేరువ చేస్తామని వెల్లడించారు. ట్రాఫిక్ సమస్యలు, డ్రగ్స్ నియంత్రణ, రౌడీషీటర్లపై ఉక్కుపాదం మోపుతామని స్పష్టం చేశారు. బాధ్యతల స్వీకరణ అనంతరం కమిషనరేట్ పరిధిలోని డీసీపీలు, ఏసీపీలతో సుమతి సమీక్ష నిర్వహించారు. కమిషనరేట్‌లో నేరాల తీరు, పెండింగ్ కేసులు, లా అండ్ ఆర్డర్ పరిస్థితిపై ఆరా తీశారు. సిబ్బంది ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలని, బాధితులకు సత్వర న్యాయం అందించాలని ఆదేశించారు.

## పదో తరగతిలో త్రివేణి ప్రతిభ

**విద్యార్థులకు ఎమ్మెల్యే గాంధీ అభినందన**



**శేరిలింగంపల్లి, విశాలభారతి:** మదీనాగూడ త్రివేణి విద్యాసంస్థలో పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ గురువారం అభినందించారు. విద్యార్థులను శాలువాతో సత్కరించి, మొక్కలు బహూకరించారు.ఈ ఏడాది ఫలితాల్లో మనస్విని 585, హర్షిత 585, పూజిత 584, ఆదిత్య సాయి 583 మార్కులు సాధించారు. మొత్తం 17 మంది విద్యార్థులు 550కి పైగా మార్కులతో ఉత్తీర్ణులయ్యారు.భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలి. తల్లిదండ్రులకు, నియోజకవర్గానికి మంచి పేరు తేవాలి' అని గాంధీ ఆకాంక్షించారు. త్రివేణి యాజమాన్యం డాక్టర్ వీరేంద్ర చౌదరి విద్యార్థులను అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దుతున్నారని, ఈ ఫలితాలే అందుకు నిదర్శనమని పేర్కొన్నారు.కార్యక్రమంలో సీఆర్ఓ సాయి నరసింహ రావు, ప్రిన్సిపల్ లక్ష్మీ ప్రసన్న, హాస్టల్ ప్రిన్సిపాల్ జగదీశ్వర్ రావు, ఏసీఆర్ఓ నరేష్, నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నడిగడ్డ తండా గిరిజన సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా సభావత్ హన్మ నాయక్

**తండా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్న నూతన అధ్యక్షుడు**

**శేరిలింగంపల్లి విశాలభారతి:** మియాపూర్ డివిజన్ నడిగడ్డ తండా గిరిజన సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడిగా సభావత్ హన్మ నాయక్ గురువారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.నడిగడ్డ తండా గిరిజన సంక్షేమ సంఘం, వర్కింగ్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం మియాపూర్‌లో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. గత ఎన్నో ఏళ్లుగా తండా నిర్మాణం, అభివృద్ధిలో భాగస్వామిగా నీతి నిజాయితీగా పనిచేస్తున్న సభావత్ హన్మ నాయక్‌ను హోల్ ఓటింగ్ ద్వారా అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్షుడు సభావత్ హన్మ నాయక్ మాట్లాడుతూ 'అన్ని వర్గాల ప్రజలను చైతన్యపరిచి కలుపుకొని పూర్తిస్థాయి కమిటీ కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకుంటాం. నడిగడ్డ తండాలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తా' అని స్పష్టం చేశారు. తనను అధ్యక్షుడిగా ఎంపిక చేసేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.ఈ సమావేశం నడిగడ్డ తండా వర్కింగ్ కమిటీ సభ్యులు నేనావత్ దేవా నాయక్, మద్దిలేటి, లక్పతి నాయక్ ఆధ్వర్యంలో జరిగింది. తండా అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, మౌలిక వసతుల కల్పనపై సమావేశంలో చర్చించారు. త్వరలో పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ప్రకటిస్తామని నిర్వాహకులు తెలిపారు.





# ఆ విషయాన్నే మర్చిపోయా!

దళపతి విజయ్‌తో సన్నిహిత సంబంధాల్ని కొనసాగిస్తూ తమిళనాట వార్తల్లో నిలుస్తున్నది అగ్ర కథానాయిక త్రిష. తాజాగా సూర్య 'కరుప్పు' సినిమా విషయంలో నిర్మాతలకు, త్రిషకు మధ్య రాజుకున్న వివాదం చర్చనీయాంశంగా మారింది. 'కరుప్పు' చిత్రం ఈ నెల 14న తమిళ, తెలుగు భాషల్లో విడుదలకు సిద్ధమవుతున్నది. ఇరవైఏండ్ల విరామం తర్వాత సూర్యతో కలిసి త్రిష నటించిన చిత్రమిది కావడం విశేషం. ఈ సినిమా ప్రచార కార్యక్రమాలకు త్రిషను దూరంగా పెట్టినట్లు కోలీవుడ్‌లో ప్రచారం జరుగుతున్నది. ఇటీవల నిర్వహించిన ఆడియో వేడుకలో కూడా త్రిష కనిపించలేదు. వేదికపై ఆమె గురించి ఎవరూ మాట్లాడలేదు. ఈ నేపథ్యంలో చిత్రబృందంపై విమర్శలొస్తున్నాయి. తాజాగా త్రిష తాలూకు లుక్ వీడియోను శుక్రవారం రిలీజ్ చేశారు. దీనిపై త్రిష వ్యంగ్యంగా స్పందించింది. ఈ సినిమాలో తాను నటించిన విషయాన్ని మర్చిపోయానని, కనీసం ఈ వీడియోతో గుర్తుచేసినందుకు థాంక్స్ అంటూ ఎక్స్‌లో పోస్ట్ పెట్టింది. దీంతో నిర్మాతలు, త్రిష మధ్య నిజంగానే వివాదాలు తలెత్తాయని చెన్నై సినీ వర్గాల్లో వినిపిస్తున్నది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.